


RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక




ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 184 | సంపాదకులు : గొంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | సోమవారం 24 - ఆగష్టు - 2026 | వెల రూ. 5 /-

## తెలంగాణలో ఎల్లో అలర్ట్..

పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు



- తెలంగాణలో మంగళవారం వరకు భారీ వర్షాలు
- వాతావరణ శాఖ నుంచి ఎల్లో అలర్ట్ జారీ
- హైదరాబాద్‌లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

2

## వందేమాతరం అంటే హిందూ దేవతల పూజ కాదు

- బాబా రాందేవ్



- వందేమాతరం అంటే దేవతల ఆరాధన కాదని, భారతమాత ఆరాధన అని రాందేవ్ స్పష్టీకరణ
- గీతాన్ని ఒక మతానికి వ్యతిరేకమనడం మేధో దివాళాకోరుతనమని వ్యాఖ్య
- నిరసన ప్రదర్శనల్లోకి మైనర్లను తీసుకురావడం సరికాదని హితవు
- కంగనా వ్యాఖ్యలపై తనదైన శైలిలో స్పందించిన యోగా గురు

2



# అంతరిక్షంలో భారత్ 'నిఘా నేత్రాలు'

- హైడ్రా పనులతో మారిన రూపు..

**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** భారత రక్షణ రంగం సరికొత్త సాంకేతిక యుగంలోకి అడుగుపెడుతోంది. శత్రు దేశాల నుంచి ప్రయోగించే క్షిపణులను సెకన్ల వ్యవధిలోనే గుర్తించి, వాటిని గగనతలంలోనే ధ్వంసం చేసేందుకు వీలుగా అంతరిక్ష ఆధారిత ముందస్తు హెచ్చరిక వ్యవస్థను (స్పేస్-బేస్డ్ ఇన్‌ఫ్రారెడ్ ఎర్లీ-వార్నింగ్) భారత్ వేగంగా అభివృద్ధి చేస్తోంది. ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఈ కీలక పరిణామం వెలుగులోకి వచ్చింది. 'అంతరిక్షంలో కళ్లు' (ఐస్ ఇన్ స్పేస్)గా పిలుస్తున్న ఈ వ్యవస్థ ద్వారా క్షిపణి ప్రయోగ సమయంలో దాని ఇంజిన్ల నుంచి వెలువడే అత్యధిక వేడిని (ఇన్‌ఫ్రారెడ్ సిగ్నేచర్) ఉపగ్రహాలు తక్షణమే పసిగడతాయి. దీంతో క్షిపణిని దాని ప్రయాణ మార్గంలోనే అడ్డగించి, నాశనం చేయడానికి భారత రక్షణ దళాలకు అమూల్యమైన సమయం లభిస్తుంది. గతంలో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' ఈ కొత్త వ్యవస్థ ఆవశ్యకతను స్పష్టం చేసింది. ఆ సమయంలో పాకిస్థాన్ ప్రయోగించిన ఒక హై-స్పీడ్ క్షిపణి ఢిల్లీ వైపు దూసుకొస్తుండగా, హర్యానాలోని సిర్సా వద్ద భారత వాయు రక్షణ వ్యవస్థ దానిని అడ్డగించింది. అయితే, క్షిపణి లక్ష్యాన్ని చేరడానికి కేవలం ఒకటి, రెండు నిమిషాల ....

2

- అంతరిక్షం నుంచి శత్రు క్షిపణి ప్రయోగాలను గుర్తించే సామర్థ్యంపై భారత్ దృష్టి
- ఆపరేషన్ సిందూర్ అనుభవంతో భూస్థిత రాడార్ల పరిమితులను అధిగమించే ప్రయత్నం
- 'ఎస్‌బీఎస్-3' ప్రాజెక్టుతో పాటు ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో పటిష్ఠ వ్యవస్థ నిర్మాణం
- బూస్ట్ దశలోనే క్షిపణిని గుర్తించి, దాడిని నిరోధించడానికి ఎక్కువ సమయం పొందడమే లక్ష్యం

## విద్యా హబ్‌గా హైదరాబాద్

- కేంబ్రిడ్జ్, లండన్ వర్సిటీలకు రేవంత్ ఆహ్వానం



- లండన్ యూనివర్సిటీని సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి
- హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటుపై లండన్ వర్సిటీ సానుకూలత
- కేంబ్రిడ్జ్ వర్సిటీ ప్రతినిధులతోనూ సీఎం బృందం చర్చలు
- హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మార్చడమే లక్ష్యం
- తెలంగాణతో కలిసి పనిచేసేందుకు కేంబ్రిడ్జ్ ప్రొఫెసర్ల ఆసక్తి

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణకు అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్‌లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రితో పాటు మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని బృందం 'లండన్ యూనివర్సిటీ'ని సందర్శించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు విశ్వవిద్యాలయ ప్రతినిధులు వెల్లడించారు. తెలంగాణలో ఉన్న అనుకూలతలు, విద్యా రంగంలో ఉన్న అవకాశాలను సీఎం బృందం వారికి వివరించింది...

2

# ప్రభుత్వంతో చర్చలు సఫలం..

# తెలంగాణలో ఆటో, క్యాబ్ సమ్మె విరమణ

- తెలంగాణలో అర్ధరాత్రి నుంచి జరగాల్సిన ఆటో, క్యాబ్ సమ్మె విరమణ
- ప్రభుత్వంతో కార్మిక సంఘాల చర్చలు విజయవంతం
- డిమాండ్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూల హామీ
- సమ్మెను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించిన ఐక్య కార్యాచరణ కమిటీ



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణలో ఈ అర్ధరాత్రి నుంచి తలపెట్టిన ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్ల నిరవధిక సమ్మె విరమించుకున్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ జరిపిన చర్చలు ఫలించడంతో యూనియన్లు ఈ నిర్ణయం తీసుకున్నాయి. దీంతో రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా హైదరాబాద్ నగరవాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఆగస్టు 23 అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటోలు, క్యాబ్‌లు, స్కూల్ వ్యాన్‌లు నిలిపివేయాలని 'కార్మిక సంఘాల ఐక్య .....

2

## బాహుబలి జేసీబీతో గచ్చిబౌలిలో ప్రమాదకర భవనం కూల్చివేసిన హైడ్రా



- గచ్చిబౌలి ఆంజనేయ నగర్‌లో ప్రమాదకర భవనం కూల్చివేత
- నిన్న కూలిన భవనం పక్కనే దెబ్బతిన్న మరో నిర్మాణం
- సీఎంసీ, హైడ్రా ఆధ్వర్యంలో సంయుక్త ఆపరేషన్
- ముందుజాగ్రత్తగా సమీప అపార్ట్‌మెంట్ వాసుల తరలింపు
- అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించిన అధికారులు

2

## రేవంత్‌కు క్షమాపణ చెప్పాల్సిందే

- కొండా సురేఖకు ఎమ్మెల్యేల అల్టిమేటం

- సీఎం రేవంత్‌పై మంత్రి సురేఖ కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో దుమారం
- కూతురి మాటలతో తనకు సంబంధం లేదన్న మంత్రి కొండా సురేఖ
- సురేఖను కేబినెట్ నుంచి తొలగించాలని 20 మందికి పైగా ఎమ్మెల్యేల డిమాండ్
- సీఎంకు బహిరంగ క్షమాపణ చెప్పాలని గట్టిగా పట్టుబట్టిన శాసనసభ్యులు



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల వివాదం మరింత ముదిరింది. సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని, ఆమె సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని 20 మందికి పైగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులతో సీఎంపై విమర్శలు చేయించడం సంస్కార హీనమని, కూతురి వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని సురేఖ చెప్పడం కేవలం బుకాయింపు మాత్రమేనని వారు విమర్శించారు. ఇటీవల గీసుకొండలో జరిగిన ఓ కార్యక్రమంలో కొండా సుస్మిత మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డితో పాటు పార్టీ నాయకత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై టీపీసీసీ క్రమశిక్షణ సంఘం మంత్రి సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనికి సురేఖ వివరణ ఇస్తూ, తన కూతురి వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని, వాటికి రాజకీయంగా తాను బాధ్యత .....

2

# సురేఖను ఈసారి కాపాడలేను : టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



- కొండా సురేఖను ఈసారి కాపాడలేనన్న టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్
- సీఎం రేవంత్‌పై సుస్మిత వ్యాఖ్యలు పార్టీ లైన్ దాటాయని స్పష్టీకరణ
- రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలు మాత్రం పరిధి దాటలేదన్న మహేశ్ గౌడ్

**నేటి శుభోదయ, నిజామాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత వ్యాఖ్యల వివాదం మరింత ముదురుతోంది. ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో అవకాశం ఉన్నప్పుడు సురేఖను కాపాడానని, కానీ ఇప్పుడు ఆమెను కాపాడే పరిస్థితి లేదని తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు పార్టీ లైన్ దాటాయని ఆయన స్పష్టం చేశారు. నిజామాబాద్‌తో పాటు పలుచోట్ల మీడియాతో మాట్లాడిన...

2



## అంతరిక్షంలో భారత్ 'నిఘా నేత్రాలు'..

### - శత్రు క్షిపణులకు సెకన్లలోనే చెక్!

**మొదటిపేజీ తరువాయి..** సమయం మాత్రమే ఉండగా ఈ అడ్డగింత సాధ్యమైంది. భూమిపై ఉన్న రాడార్లు భూమి వక్రత (curvature) కారణంగా ఒక పరిమితి మేరకే పనిచేస్తాయి. దీంతో ముప్పును గుర్తించడానికి తక్కువ సమయం ఉంటుంది. ఈ సమస్యను అధిగమించి, శత్రువు దాడిని ముందుగానే పసిగట్టడమే అంతరిక్ష ఆధారిత సెన్సార్ల ప్రధాన లక్ష్యం. బాలిస్టిక్ క్షిపణులు ప్రధానంగా మూడు దశల్లో ప్రయాణిస్తాయి. మొదటిది 'బూస్ట్' దశ. ఈ సమయంలో ఇంజిన్లు మండి, తీవ్రమైన వేడిని విడుదల చేస్తాయి. అంతరిక్షంలోని ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్లు ఈ వేడిని ప్రయోగించిన సెకన్ల వ్యవధిలోనే గుర్తిస్తాయి. రెండోది 'మిడ్‌కోర్స్' దశ. ఈ దశలో క్షిపణి వాతావరణం బయట ప్రయాణిస్తుంది. మూడోది 'టెర్మినల్' దశ. ఈ దశలో క్షిపణి అత్యంత వేగంతో (మాక్ 15కు పైగా) లక్ష్యం వైపు దూసుకొస్తుంది. భూస్థిత రాడార్లు కేవలం టెర్మినల్ దశలోనే క్షిపణిని గుర్తించగలవు. కానీ అంతరిక్షంలోని ఉపగ్రహాలు బూస్ట్ దశలోనే గుర్తించి హెచ్చరికలు పంపుతాయి. దీనివల్ల 'కిల్ చైన్' (గుర్తించడం, ట్రాక్ చేయడం, ధ్వంసం చేయడం) ప్రక్రియ చాలా ముందుగా ప్రారంభమవుతుంది. దీంతో వాతావరణం లోపల, వెలుపల కూడా క్షిపణిని కూల్చివేసేందుకు అవకాశం లభిస్తుంది. డీఆర్‌డీఓ ఇప్పటికే ఇటువంటి క్షిపణి విధ్వంసక పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. ఈ అత్యాధునిక వ్యవస్థ రూపకల్పనలో భారత ప్రభుత్వం, ప్రైవేట్ స్టార్టప్‌లు కలిసి పనిచేస్తున్నాయి. బెంగళూరుకు చెందిన 'దిగంతర' స్టార్టప్ 'ఆల్బట్రాస్' ఉపగ్రహాలతో బూస్ట్ దశలోనే క్షిపణులను గుర్తించే సాంకేతికతపై పనిచేస్తోంది. అహ్మదాబాద్‌కు చెందిన 'శాట్‌లియో ల్యాబ్స్' 15 ఉపగ్రహాలతో కూడిన థర్మల్ అబ్జర్వేషన్ వ్యవస్థను నిర్మిస్తోంది. ఇవి క్షిపణి ప్రయోగం వంటి అత్యధిక ఉష్ణోగ్రత ఘటనలను గుర్తించి, రియల్ టైమ్‌లో సమాచారం అందిస్తాయి.

## విద్యా హబ్‌గా హైదరాబాద్..

### కేంబ్రిడ్జ్, లండన్ వర్సిటీలకు రేవంత్ ఆహ్వానం

**మొదటిపేజీ తరువాయి..** అంతకుముందు రేవంత్ రెడ్డి బృందం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ ప్రతినిధులతో సమావేశమై విద్య, పరిశోధన రంగాల్లో పరస్పర భాగస్వామ్య అవకాశాలపై చర్చించింది. హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌ను ఏర్పాటు చేసి, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యా కోర్సులను, పరిశోధనా కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం కోరారు. ప్రపంచస్థాయి అత్యుత్తమ విద్యాసంస్థలకు హైదరాబాద్ ప్రధాన గమ్యస్థానంగా మారుతోందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఈ పర్యటనలో భాగంగా కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌కు చెందిన ప్రొఫెసర్లు జయదీప్ ప్రభు, వెంకట శిరీష్ గండికోట.. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ విజ్ఞాన కేంద్రంగా (గ్లోబల్ నాలెడ్జ్ హబ్) తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఈ విద్యాసంస్థలను ఆహ్వానించారు.

## తెలంగాణలో ఎల్లో అలర్ట్..

### పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మంగళవారం (ఆగస్టు 25) వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హైదరాబాద్ కేంద్రం వెల్లడించింది. వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల సంభవించే సూచనలు ఉన్నాయని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రానికి 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. హైదరాబాద్ నగరంలో ఆగస్టు 25 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడతాయని, బలమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. శనివారం నగరంలోని షేక్‌పేటలో అత్యధికంగా 43.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ గణాంకాల ప్రకారం, నిన్న రాష్ట్రంలో అత్యధికంగా కుమురం భీం జిల్లాలో 66 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ప్రజలు తమ ప్రయాణాలను తదనుగుణంగా ప్లాన్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## వందేమాతరం అంటే హిందూ దేవతల పూజ కాదు - బాబా రాందేవ్

**మొదటిపేజీ తరువాయి..** 'వందేమాతరం' గీతం పూర్తి రూపంలో ఆలపించడంపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో, యోగా గురు బాబా రాందేవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ గీతంలోని సాహిత్యం హిందూ దేవతలైన దుర్గ, లక్ష్మి వంటి వారిని పూజించడం గురించి కాదని, కేవలం 'భారతమాత'కు చేసే ఆరాధన అని ఆయన ఆదివారం స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాందేవ్ మాట్లాడుతూ.. "మేము భారతమాతనే దుర్గా, లక్ష్మి గా భావిస్తాం. ఆమే మా విశ్వాసం, మా జ్ఞానం, మా ఆలయం. వందేమాతరంలో దేవతలను, ఆలయాలను చూసేవారు మన సంస్కృతికి దూరమైన వారు. భారతమాత ఆరాధనను దేవతలతో ముడిపెట్టి ఒక మతానికి వ్యతిరేకమని చెప్పడం మేధో దివాళాకోరుతనం" అని అన్నారు. విద్యార్థుల నిరసనల గురించి ప్రస్తావిస్తూ, చిన్న పిల్లలను నిరసనల్లోకి లాగడాన్ని ఆయన తప్పుబట్టారు. "5, 10 ఏళ్ల పిల్లలను కూడా పోలీస్ స్టేషన్లను ముట్టడించాలని, ఎస్పీలు, డీఎంలను ఘెరావ్ చేయాలని ప్రోత్సహిస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. అయితే, 18 ఏళ్లు నిండిన వారు ఎక్కడ అన్యాయం జరిగినా తప్పక పోరాడాలి" అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కుల దూషణలపైనా రాందేవ్ స్పందించారు. "షెడ్యూల్డ్ కులాలు లేదా తెగల వారిని అవమానించడం రాజ్యాంగ విరుద్ధమైనప్పుడు, బ్రాహ్మణులను దూషించడం కూడా ప్రజాస్వామ్యానికి విరుద్ధమే" అని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని అమలు చేసిన ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీని ఆయన ప్రశంసించారు. ఇటీవల తన వ్యక్తిగత జీవితంపై వ్యాఖ్యలు చేయవద్దని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన సూచనపై రాందేవ్ స్పందిస్తూ.. "స్వామి రాందేవ్ ఎవరో, ఆయన సేవ ఏంటో ఈ దేశ ప్రజలకు తెలుసు. అందువల్ల, అలాంటి స్థాయి వ్యక్తుల గురించి నేను ఎలాంటి వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదు" అని అన్నారు.

## ప్రభుత్వంతో చర్చలు సఫలం..

### - తెలంగాణలో ఆటో, క్యాబ్ సమ్మె విరమణ

**మొదటిపేజీ తరువాయి..** కార్యాచరణ' పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే స్పందించి యూనియన్ల నేతలను చర్చలకు ఆహ్వానించింది. మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన యూనియన్ల డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించారు. ప్రధానంగా ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ డిమాండ్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ఆయన అంగీకారం తెలిపినట్టు సమాచారం. ప్రభుత్వ హామీతో సంతృప్తి చెందిన యూనియన్ల నేతలు, సమ్మెను విరమించుకుంటున్నట్లు అధికారికంగా ప్రకటించారు. మంత్రితో చర్చలు సఫలం కావడంతో, యథావిధిగా ఆటోలు, క్యాబ్‌లు, ఇతర ప్రైవేట్ వాహనాలు రోడ్డెక్కనున్నాయి. దీంతో ప్రయాణికులకు రవాణా కష్టాలు తప్పినట్టయింది.

## రేవంత్‌కు క్షమాపణ చెప్పాల్సిందే

### - కొండా సురేఖకు ఎమ్మెల్యేల అల్టిమేటం

**మొదటిపేజీ తరువాయి..** వహించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. తనపై జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు. అయితే, సురేఖ వివరణపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ శాసనసభా పక్షం వేదికగా సమావేశమై, సురేఖపై మూకుమ్మడిగా విరుచుకుపడ్డారు. పార్టీ అంతర్గత విషయాలను బహిరంగంగా మాట్లాడటం సరికాదని, సురేఖ వెంటనే తన కుమార్తె వ్యాఖ్యలను ఖండించి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని డిమాండ్ చేశారు. సీనియర్ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా స్పందించారు. సుస్మిత వ్యాఖ్యలు పార్టీ నిబంధనలను అతిక్రమించాయని, దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నామని స్పష్టం చేశారు. మరోవైపు, క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు మల్లు రవి కూడా సుస్మిత వ్యాఖ్యలు అనుచితమని, మంత్రిగా ఉన్న సురేఖ వాటిని ఖండించకపోవడం తప్పని అన్నారు. శనివారం సమావేశమైన క్రమశిక్షణ కమిటీ.. సురేఖ వివరణ, వీడియో ఫుటేజీలను పరిశీలించి, తుది నిర్ణయం తీసుకోకుండా మరిన్ని సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది.

## సురేఖను ఈసారి కాపాడలేను : టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

**మొదటిపేజీ తరువాయి..** మహేశ్ గౌడ్, సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలిపారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి మాట్లాడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని, ఆమె ఇచ్చే వివరణను బట్టి తదుపరి చర్యలు ఉంటాయని వివరించారు. ఈ వ్యాఖ్యలు పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా ఉన్నాయని, వీటిని ఉపేక్షించేది లేదని అన్నారు. మరోవైపు, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు మల్లు రవి నేతృత్వంలో శనివారం గాంధీ భవన్‌లో సమావేశం జరిగింది. కొండా సురేఖ సమర్పించిన వివరణను కమిటీ పరిశీలించింది. కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమని సురేఖ చెప్పినప్పటికీ, కమిటీ దానితో ఏకీభవించలేదు. మంత్రిగా ఉన్న సురేఖ ఆ వ్యాఖ్యలను ఖండించకపోవడం తప్పని అభిప్రాయపడింది. అయితే, తుది నిర్ణయం తీసుకోకుండా మరిన్ని సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇదే సమయంలో, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీ లైన్ దాటలేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేయడం గమనార్హం. కేవలం సురేఖ కుమార్తె వ్యాఖ్యలపైనే పార్టీ తీవ్రంగా దృష్టి సారించినట్లు ఆయన మాటల ద్వారా వెల్లడైంది.

## బాహుబలి జేసీబీతో గచ్చిబౌలిలో ప్రమాదకర భవనం కూల్చివేసిన హైడ్రా

**మొదటిపేజీ తరువాయి..** రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని ఆంజనేయ నగర్‌లో శనివారం ఓ ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన నేపథ్యంలో, దాని పక్కనే ప్రమాదకరంగా మారిన మరో బహుళ అంతస్తుల భవనాన్ని అధికారులు కూల్చివేశారు. సీఎంసీ (సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్), హైడ్రా బృందాలు సంయుక్తంగా ఆదివారం ఉదయం ఈ ఆపరేషన్ చేపట్టాయి. శనివారం సాజిద్ అనే వ్యక్తికి చెందిన భవనం కూలిపోవడంతో, దాని శిథిలాలు పక్కనే ఉన్న మరో ఏడంతస్తుల భవనంపై పడ్డాయి. దీంతో ఆ భవనం కూడా తీవ్రంగా దెబ్బతిని, ఏ క్షణమైనా కూలిపోయే స్థితికి చేరింది. ఈ నిర్మాణం వల్ల చుట్టుపక్కల భవనాలకు, ప్రజలకు పెను ప్రమాదం పొంచి ఉందని సీఎంసీ అధికారులు నిర్ధారించారు. వారి అభ్యర్థన మేరకు హైడ్రా బృందాలు రంగంలోకి దిగి కూల్చివేత పనులను ప్రారంభించాయి. ఈ భవనాలు అత్యంత సమీపంలో, ఎలాంటి ఖాళీ స్థలం లేకుండా నిర్మించడంతో కూల్చివేత సవాలుగా మారింది. 'బాహుబలి' జేసీబీ వంటి భారీ యంత్రాలను ఉపయోగిస్తూ, సమీపంలోని ఇతర నిర్మాణాలకు ఎలాంటి నష్టం కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కూల్చివేత నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా, సమీపంలోని స్టెర్లింగ్ వైట్‌ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌లోని నివాసితులను ఇళ్లు ఖాళీ చేయించారు. ఆ ప్రాంతంలోకి ప్రజలు రాకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆంజనేయ నగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా కేవలం 50 గజాల స్థలంలోనే ఏడంతస్తుల వరకు పేకమేడల్లా భవనాలు నిర్మించారని అధికారులు తెలిపారు. ఈ అక్రమ నిర్మాణాలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణమించడంతో కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఈ ఘటనతో అక్రమ నిర్మాణాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నట్లు స్పష్టమవుతోంది.

## మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ కేసులో కీలక అరెస్ట్

- **వ్యాపారిపై దాడి, బెదిరింపుల కేసులో సుమంత్ డ్రైవర్ అరెస్ట్**
- **రూ.10 కోట్లు డిమాండ్ చేశారని బాధితుడు హరికృష్ణ ఆరోపణ**
- **దాడిలో చేయి విరిగిందని పోలీసులకు ఫిర్యాదు**
- **తెల్లాపూర్‌లో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ**



**నేటి శుభోదయ, తెల్లాపూర్ :** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) సుమంత్ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. సుమంత్ వ్యక్తిగత డ్రైవర్‌ను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. తెల్లాపూర్‌లోని సుమంత్ నివాసం సమీపంలోనే అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. బోడుప్పల్‌కు చెందిన వ్యాపారి గొంగిడి హరికృష్ణ (36)పై దాడి చేసి, బెదిరింపులకు పాల్పడిన కేసులో సుమంత్‌తో పాటు ప్రశాంత్, రాము, కార్తీక్ అరుణ్ కుమార్ రెడ్డి, మహేందర్ రెడ్డిలపై పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేశారు. నిందితులు తనను రూ.10 కోట్లు డిమాండ్ చేశారని, ఆ నగదు ఇచ్చేందుకు నిరాకరించడంతో తనపై భౌతిక దాడికి పాల్పడ్డారని హరికృష్ణ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ దాడిలో తన ఎడమ చేయి ఫ్రాక్చర్ అవ్వడమే కాకుండా ఇతర గాయాలయ్యాయని వెల్లడించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే తాజాగా సుమంత్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## జనసేన నుంచి ఉమ్మడి ఖమ్మం,నల్లగొండ,వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా - డాక్టర్ గడల శ్రీనివాసరావు

**ఖమ్మం, ఆగష్టు 23, నేటి శుభోదయ :**
ఖమ్మం–నల్లగొండ–వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జనసేన పార్టీ అభ్యర్థిగా డాక్టర్ గడల శ్రీనివాసరావు పేరును పార్టీ ముందస్తుగా ప్రకటించింది.డాక్టర్ గడల శ్రీనివాసరావు జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు, అధికార ప్రతినిధి, ఉమ్మడి ఖమ్మం జిల్లా జనసేన పార్టీ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో వైద్య ఆరోగ్యశాఖలో ఉన్నతస్థాయిలో సేవలందించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్య రంగంలో ఆయన విశేష సేవలు అందించారు.జనసేన పార్టీ జాతీయ కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ అధ్యక్షులు శంకర్ గౌడ్ డాక్టర్ గడల శ్రీనివాసరావు పేరును పార్టీ జాతీయ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రతిపాదించారు.డాక్టర్ గడల శ్రీనివాసరావు అభ్యర్థిత్వానికి పవన్ కళ్యాణ్ సుముఖత వ్యక్తం చేయడంతో, ఉమ్మడి ఖమ్మం–నల్లగొండ–వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ గడల శ్రీనివాసరావు పేరును జనసేన పార్టీ ముందస్తుగా ప్రకటించింది.పట్టభద్రులు, ఉద్యోగులు, యువత, విద్యావంతులు, మేధావుల సమస్యలను శాసన మండలి వేదికగా బలంగా వినిపించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని డాక్టర్ గడల శ్రీనివాసరావు తెలిపారు.ఉమ్మడి మూడు జిల్లాల పట్టభద్రులు, మేధావులు, ఉన్నత విద్యావంతులు, ఉద్యోగులు తనకు ఆశీస్సులు అందించి ఆదరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.తనను పట్టభద్రుల



ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించినందుకు జనసేన పార్టీ జాతీయ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కి, జాతీయ కార్యదర్శి శ్రీ రామ్ తాళ్లూరి కి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శంకర్ గౌడ్ కి డాక్టర్ గడల శ్రీనివాసరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఉమ్మడి ఖమ్మం–నల్లగొండ–వరంగల్ జిల్లాల పట్టభద్రుల మద్దతుతో ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకుని తెలంగాణలో జనసేన పార్టీ సత్తా చాటుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు."పట్టభద్రుల గొంతుకగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం..."డాక్టర్ గడల శ్రీనివాసరావుకు ఉమ్మడి మూడు జిల్లాల పట్టభద్రులు తమ ఆశీస్సులు, ఆదరణ అందించాలని జనసేన పార్టీ తరఫున విజ్ఞప్తి చేశారు.

## టెన్త్ క్లాస్ మిత్రుడి కుటుంబానికి రూ.90 వేలు ఆర్థిక సహాయం



**ఖమ్మం, ఆగష్టు 23, నేటి శుభోదయ:**
తమతో కలిసి చదువుకుని తనువు చాలించిన తోటి స్నేహితుడి కుటుంబానికిరూ.90 వేల నగదును ఆర్థిక సహాయంగా అందజేసి ఔదార్యం చాటుకున్నారు. ఖమ్మం నగరంలోని రిక్కా బజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో (1999-2000,బ్యాచ్) టెన్త్ క్లాస్వరకు తమతో కలిసి చదువుకుని, హైద్రాబాద్ లో స్థిరపడిన దండు రామకృష్ణ(38) జూన్ 24వ తేదీన షుగర్ లెవల్స్ ఎక్కువయ్యి గుండె పోటు తో హఠాన్మరణం చెందారు. తోటి స్నేహితుడి హఠాన్మరణం తెలుసుకున్న మిగతా మిత్రులువాట్సాప్ గ్రూప్ లో స్నేహితులందరూ కలిసినిరుపేద కుటుంబానికి అండగా నిలవాలని నిశ్చయించుకున్నారు. స్నేహితుల ద్వారా రూ.90 వేలు సేకరించారు. సేకరించిన ఆర్థిక సహాయాన్ని ఆదివారంహైద్రాబాద్ వెళ్లిన మిత్ర బృందం ఆ కుటుంబాన్నీ పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు.ఆర్థిక సహాయం అందజేసిన వారిలో షేక్ మాదార్(మాజీ సైనికుడు), మోగిలి శ్రీనివాసరావు, గుజ్జులూరి ఉప్పలయ్య(కోర్ట్ ఉద్యోగి), సల్లూరి భాస్కర్(డిఫెన్స్ ఉద్యోగి), పేరబోయిన తిరుపతి రావు, ఎర్రగాని రఘు తదితరులు ఉన్నారు.

## ముస్లిం ల అభ్యున్నతికి మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవ

- **ముస్లిం మతపెద్దల విజ్ఞప్తికి సానుకూల స్పందన**
- **ఖబరస్తాన్ స్థలాలు ప్రహరీ గోడల నిర్మాణానికి నిధుల కేటాయింపు**

**ఖమ్మం, ఆగష్టు 23, నేటి శుభోదయ :**
ముస్లిం మైనారిటీ సమాజం సంక్షేమం, వారి మతపరమైన అవసరాల పరిరక్షణకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు.ముస్లిం మతపెద్దలు, మత గురువుల విజ్ఞప్తి మేరకు ఖబరస్తాన్‌లకు సంబంధించిన స్థలాలు , రక్షణ కోసం ప్రహరీ గోడల నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించడం పట్ల ముస్లిం సమాజం హర్షం వ్యక్తం చేసింది.ఈ సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ రషీద్ తో కలిసి మతపెద్దలు, మత గురువులు సంబంధిత ఖబరస్తాన్ స్థలాలను సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఖబరస్తాన్‌లను భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించేందుకు ప్రహరీ గోడల నిర్మాణం ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా జామియత్ ఉలమా ఖమ్మం జిల్లా అధ్యక్షులు మౌలానా మొహమ్మద్ సయీద్ అహ్మద్ ఖాస్మీ, మతపెద్దలు షానవాజ్ ,అబ్దుల్ మజీద్,అబ్దుల్ రెహ్మాన్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దూరదృష్టి, ప్రజా సంక్షేమ దృక్పథాన్ని అభినందించారు.కులమతాలకు అతీతంగా ప్రతి వర్గం సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రశంసనీయమని వారు అన్నారు. ప్రజలకు కేవలం తాత్కాలిక ప్రయోజనాలు అందించడం కాకుండా, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే శాశ్వత మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ఖబరస్తాన్‌ల కు స్థలాలు, ప్రహరీ గోడల నిర్మాణానికి నిధులు కేటాయించడం ముస్లిం సమాజం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొంటూ, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ రషీద్‌కు మతపెద్దలు, మత గురువులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు."ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, కులమతాలకు





అతీతంగా అభివృద్ధిని కొనసాగించడం ప్రజా ప్రభుత్వ ధ్యేయం" అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ,మౌలానా గని,ప్రభుత్వ ఖాజీ ముఫ్తీ ఆసిఫ్,ముఫ్తీ షుజాఉద్దీన్,ముఫ్తీ అలావుద్దీన్,మౌలానా సయ్యద్ సాబిర్,హఫీజ్ ఉస్మాన్,మౌలానా సల్మాన్,ముఫ్తీ ఇమ్రాన్ ఖాన్,అఫ్సర్,ఖాసీం,సమద్,గౌస్,తాజ్ బాబా, రహీముద్దీన్,సాజిద్, ముదస్సర్, జహీర్, ఖదీర్, సలీం, సర్వర్, తదితరులు పాల్గొన్నారు.

## రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ - తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు గ్రామీణ అవగాహన



**ఇబ్రాహీంపట్నం ఆగస్టు 23, నేటి శుభోదయ:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామం రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యా లయం విద్యార్థుల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు రావేపులోభాగం గా రైతులకు వ్యవసాయ పనులు చేసే సమయంలో రక్షణ దుస్తుల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం కమ్యూనిటీ సైన్స్ కళాశాల దుస్తులు వస్త్రాలు విభాగానికి చెందిన విద్యార్థులు వ్యవసాయ పనుల సమయంలో రైతులు ఎదుర్కొనే దుమ్ము ధూళి పురుగుమందులు రసాయనాలు ముళ్లు ఎండ ఇతర ప్రమాదాల నుంచి శరీరాన్ని రక్షించుకోవడానికి సరైన రక్షణ దుస్తు లు ధరించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు ఈకార్యక్రమంలో వ్యవసాయ పనులకు అ నుగుణంగా గ్లౌజులు రబ్బరు బూట్లు లేదా గమ్‌బూట్లు మాస్కులు టోపీలు తల కవర్లు పొడ వై న చేతుల చొక్కాలు పొడవైన ప్యాంట్లు కంటి రక్షణ కళ్లద్దాలు వంటి రక్షణ పరికరాల ను ఎలా ఉపయోగించాలో ప్రత్యక్షంగా ప్రదర్శించారు ముఖ్యంగా పురుగుమందులు ఇతర వ్యవసాయ రసాయనాలను పిచికారీ చేసే సమయంలో చేతులు కళ్ళు ముక్కునోరు చర్మాన్ని రక్షించుకోవడం ఎంతో అవసరమని తెలిపారు రసాయనాలతో పని చేసిన తర్వా త రక్షణ దుస్తులను వేరుగా ఉతకడం చేతులు ముఖాన్ని సబ్బుతో శుభ్రంగా కడుక్కో వడం తడిగాలేదా కలుషితమైన దుస్తులను వెంటనే మార్చుకోవడం వంటి జాగ్రత్తలను కూడా వివరించారు ఈకార్యక్రమానికి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సాయి కృష్ణ మంచాల వ్యవసాయ అధికారి వెంకటేష్ ఏఈఓ లింగస్వామి నిఖితఆరుట్ల సర్పంచ్ శోభ కుమార్ ఉపసర్పంచ్ నూకం రాజుముదిరాజ్ వార్డు సభ్యులు హాజరై కార్యక్రమాన్ని ప్రోత్సహించారు రైతులు కార్యక్రమంలో ఆసక్తిగా పాల్గొని వ్యవసాయ పనుల సమయంలో ఉపయోగించాల్సిన రక్షణ దుస్తులు పురుగుమందుల నుంచి రక్షణ వ్యక్తిగత భద్రతకు సంబంధించిన సందే హా లను నివృత్తి చేసుకున్నారు ఈ అవగాహన కార్యక్రమం ద్వారా రైతుల్లో వ్యక్తిగత భద్రత ఆరోగ్య పరిరక్షణ రసాయనాల వల్ల కలిగే ప్రమాదాల నివారణ వ్యవసాయ పనుల్లో రక్షణ దుస్తుల ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందింది వ్యవసాయ పనులు చేసేటప్పుడు నిర్ల క్ష్యం చే యకుండా తగిన రక్షణ దుస్తుల ను తప్పనిసరిగా ఉపయోగించి ఆరోగ్యాన్ని భద్రతను కాపాడుకోవాలని విద్యార్థులు రైతులకు సూచించారు కార్యక్రమంలో రైతులు గ్రామస్తు లు తదితరులు పాల్గొన్నారు.

## సింహాద్రి నగర్‌లో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

**- కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన 32 వ వార్డు సిపిఐ కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి**

**ఖమ్మం, ఆగష్టు 23, నేటి శుభోదయ :**
ఎదులాపురం మున్సిపాలిటీ 32వ వార్డు పరిధిలోని సింహాద్రి నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు 32వ వార్డు సిపిఐ కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి ఆదివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, సింహాద్రి నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణంతో కాలనీ ప్రజలకు రాకపోకల్లో మరింత సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 28వ వార్డు సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు, భారత కమ్యూనిస్టు పార్టీ 32వ వార్డు కార్యదర్శి మామిడి సుధర్శన్ రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గణపారపు ఉపేందర్, ఉపాధ్యక్షులు మామిడాల కిరణ్, యువజన సంఘం నాయకులు పొన్నం



ఉమేష్ , కాలనీ వాసులు నిమ్మకంటి యుగంధర్, వల్లోజి సత్యనారాయణ, రావెళ్ల అశోక్, రాజగోపాల్ రెడ్డి, ధరణబోయిన వెంకటేశ్వర్లు, కటకం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజు స్వగ్రామం ఇనుగుర్తిలో మనుమరాలి డోలాహరణ మహోత్సవం



**ఖమ్మం, ఆగస్టు 23, నేటి శుభోదయ :**
బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మనుమరాలి డోలాహరణ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది.ఎంపీ రవిచంద్ర స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలోని కాకతీయుల కాలం నాటి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జరిగిన ఈ వేడుకకు కుటుంబ సభ్యులు, గ్రామ ప్రముఖులు హాజరయ్యారు.రవి చంద్ర-విజయలక్ష్మీల కుమారుడు-కోడలు నిఖిల్ చంద్ర-అనీల దంపతుల కనిష్ఠ కూతురు తారుణి డోలాహరణ మహోత్సవం (తొట్టెల వేడుక)వేద పండితుల మంత్రోచ్ఛరణాలు,ఆశీర్వచనాల మధ్య ఘనంగా జరిగింది.ఈ వేడుకకు తాతలు- నాయినమ్మలు వద్దిరాజు కిషన్-శశిరేఖ, వద్దిరాజు దేవేందర్-ఇందిర,వద్దిరాజు మోహన్-వాసవి,వద్దిరాజు వెంకటేశ్వర్లు-పద్మ, వద్దిరాజు వెంకటేశ్వర్లు-ఉమా మహేశ్వరి,తాత శీలంశెట్టి సత్యనారాయణ,అమ్మమ్మ రేవతి పద్మ,తాత-అమ్మమ్మ సంగిశెట్టి రాంమూర్తి-పద్మ,మేనత్తలు జె.సునీత, డాక్టర్ గంగుల గంగాభవాని,పెద నాన్నలు వద్దిరాజు శ్రీనివాస్,వద్దిరాజు ధీరజ్,బాబాయిలు వద్దిరాజు అఖిల్,వద్దిరాజు గిరినందన్,మేనత్త భర్త విజయ్,అక్క వద్దిరాజు సహస్రిక తదితరులు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.

## బీజేపీలో చేరిన శాఖరం గ్రామ కాంగ్రెస్ ముఖ్య నేతలు

- **మెదక్ ఎంపీ రఘునందన్ రావు సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్న నేతలు**
- **పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యే చేరికలు : బొల్లిపల్లి తిరుపతి రెడ్డి**



**వర్గల్, ఆగస్టు 23, నేటి శుభోదయ :**
సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం శాఖరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సయ్యద్ బాబా, ఖాదర్ షరీఫ్, మహమ్మద్ అలీలు ఆదివారం భారతీయ జనతా పార్టీలో చేరారు. బీజేపీ సిద్ధాంతాలు, ప్రధాని మోదీ నాయకత్వంలోని అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. వర్గల్ మండల బీజేపీ అధ్యక్షులు బొల్లిపల్లి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు నూతన నాయకులకు కాషాయ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన మైనార్టీ నాయకులకు ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీరా ధనరాజ్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీజేపీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజలు, ఇతర పార్టీల నాయకులు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీతారాంపల్లి గ్రామ సర్పంచ్ రామాంజనేయులు, నాయకులు రేణుదాస్, సయ్యద్ అబ్దుల్ ఖదీర్‌లతో పాటు స్థానిక బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ...

- **రిమ్మనగూడ శ్రీ సాయి ఎ సీసీ బ్లాక్ కంపెనీ ఎండి వినయ్‌కుమార్ సేవా కార్యక్రమం.**
- **25 మంది విద్యార్థులకు అందజేత.**



**గజ్వేల్, ఆగస్టు 23 , నేటి శుభోదయ :**
విద్యార్థుల విద్యాభ్యాసాన్ని ప్రోత్సహించేందుకు సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం రిమ్మనగూడ లోని గ్రామంలోని 'శ్రీ సాయి ఏఏసీ బ్లాక్ కంపెనీ' మేనేజింగ్ డైరెక్టర్ కె. వినయ్‌కుమార్ ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. చదువుపై ఆసక్తి పెంచేందుకే. ఈ సందర్భంగా ఎండీ కె. వినయ్‌కుమార్ మాట్లాడుతూ, చిన్ననాటి నుంచే పిల్లల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించడానికి, వారి భవిష్యత్తుకు అవసరమైన ప్రోత్సాహాన్ని అందించడానికే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఎండీ వినయ్‌కుమార్‌కు అభినందనలు. పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తూ స్కూల్ బ్యాగులు అందజేయడంపై స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. సామాజిక బాధ్యతతో విద్యార్థుల సంక్షేమం కోసం ముందుకు వచ్చిన శ్రీ సాయి ఏఏసీ బ్లాక్ కంపెనీ ఎండీ కె. వినయ్‌కుమార్‌ను పలువురు ప్రశంసించారు.

## అధిక ధరలను వెంటనే తగ్గించాలి

- **సిపిఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం**



**ఖమ్మం, ఆగష్టు 23, నేటి శుభోదయ :**
నిత్యావసర సరుకుల ధరలను కేంద్ర ప్రభుత్వం ఒక పథకం ప్రకారం నిరంతరం పెంచుతూ సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతోందని, పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక త్రీ టౌన్ పరిధిలోని పంపింగ్ వెల్ రోడ్ సెంటర్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహమ్మద్ సలాం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలు ఏ వస్తువునూ కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరకు ముడిసరుకును పెట్రోల్‌లో కలపడం వంటి విధానాల వల్ల ఒకవైపు చక్కెర ధరలు పెరుగుతున్నాయని, మరోవైపు పెట్రోల్ వినియోగంతో వాహనాల మరమ్మతుల భారం కూడా పెరుగుతోందని విమర్శించారు.నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండటంతో ప్రజల జీవనం భారంగా మారిందని, సామాన్య ప్రజలు ఎలా బతకాలని ఆయన ప్రశ్నించారు. ప్రజా సమస్యలను ప్రశ్నించే విద్యార్థులు, యువతపై వివిధ రకాల ఆరోపణలు చేస్తూ కేసులు నమోదు చేయడం, ఇతర అంశాలను తెరపైకి తీసుకురావడం ద్వారా అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.ప్రజలు నిత్యం వినియోగించే నిత్యావసర వస్తువుల ధరలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే తగ్గించాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని మహమ్మద్ సలాం డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆయన విమర్శించారు.ఈ కార్యక్రమంలో త్రీ టౌన్ సహాయ కార్యదర్శులు భూక్యా రవీందర్, ఎన్. కుమార్, నూనె నందు, నాయకులు చిర్ర వెంకన్న, డి. సురేష్ నాయక్, నక్క లింగయ్య, ముజామిల్, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## రేపు జరిగే సర్పంచ్ ల చైతన్య సదస్సును జయప్రదం చేయండి

- **సర్పంచ్ ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి**
- **విలేకరుల సమావేశంలో పంచాయతీ రాజ్ చాంబర్స్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పుసులూరి నరేందర్**



**ఖమ్మం ఆగస్టు 23, నేటి శుభోదయ :**
ఈనెల 25న ఖమ్మంలోని లకారం ట్యాంక్ బండ్ లేక్ యు క్లబ్ లో జరిగే తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఖమ్మం జిల్లా సర్పంచ్ ల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్స్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కుసులూరి నరేందర్ పిలుపునిచ్చారు.ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నరేందర్ మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే తొలుత గ్రామాల అభివృద్ధి జరగాలని, గ్రామాలు శక్తివంతంగా స్వచ్ఛందంగా పచ్చదనంగా ఉంటేనే ఈ దేశం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. 79 ఏండ్ల స్వాతంత్ర భారతదేశంలో స్థానిక సంస్థల గ్రామ పాలన రోజు రోజుకు దిగజారి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మాహత్మ గాంధీ తన కళ్ళలను సహకారం చేసుకునేందుకు గ్రామాలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అందుకు అవసరమైన నిధుల కేటాయింపులు సర్పంచ్ పాలనకు కేటాయింపులు చేయాలని కోరారు. చెక్కు పవర్ గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శికి ఉండాలని, 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా 243 జి లో ఆర్టికల్లోని 11వ షెడ్యూల్లో పొందుపరిచిన 29 అంశాలను పంచాయతీలకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో 50 శాతం నిధులను గ్రామపంచాయతీలకు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన రిజిస్ట్రేషన్లు, మైనింగ్, రాయాల్టీ ట్యాక్స్‌లు ఇతర రాబడులు గ్రామ పంచాయతీలకు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సర్పంచుల అందరికీ గౌరవ వేతనం 30 వేలు ఇవ్వాలని కోరారు. రేపు ఖమ్మం లో మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే జిల్లా సర్పంచుల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని నరేందర్ విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జడ్పిటిసిల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు బెల్లం శ్రీనివాస్, ఎంపీపీ ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లోడిగా వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

## ధర్పల్లి పెట్రోల్ బంకులో పడకేసిన ఉచిత సేవలు
### : పక్క షాపులో డబ్బులిస్తేనే గాలి!



**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి,ఆగస్టు 23, నేటి శుభోదయ :**
ధర్పల్లి మండల కేంద్రంలోని పెట్రోల్ బంకులో వాహనదారులకు అందాల్సిన ఉచిత వసతులు మాటలకే పరిమితమవుతున్నాయి. బంకు ఆవరణలోని ఎయిర్ కాంప్రెషర్ మిషన్ నెలల తరబడి చెడిపోయి నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఉచితంగా గాలి నింపాల్సిన పెట్రోల్ బంక్ కాంప్రెషర్ పనిచేయకపోవడంతో, వాహనదారులు విధిలేని పరిస్థితుల్లో పక్కనే ఉన్న ప్రైవేట్ షాపుల్లో డబ్బులు చెల్లించి గాలి కొట్టించుకోవాల్సి వస్తోంది.బంకులో కాంప్రెషర్ బంద్.. పక్క షాపులో గాలి లభ్యం!పెట్రోల్ బంకుల్లో ఇంధనం విక్రయించడమే కాకుండా ఉచితంగా గాలి, తాగునీరు వంటి కనీస సేవలు అందించడం నిబంధన. అయితే ధర్పల్లి బంకులో గాలి మిషన్ పని చేయడం లేదని బంకు సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. విచిత్రమేమిటంటే.. బంకులో పనిచేయని కాంప్రెషర్, సరిగ్గా దాని పక్కనే ఉన్న షాపులో మాత్రం లభ్యమవుతుండటం పట్ల వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వాహనదారుల అనుమానాలు:"పెట్రోల్ బంక్ యజమానులు ఉద్దేశపూర్వకంగానే కాంప్రెషర్‌ను మరమ్మతు చేయకుండా వదిలేశారా? లేక పక్క షాపు నిర్వాహకులతో లాలూచీ పడ్డారా?" అని వాహనదారులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. రోజుకు వందలాది వాహనాలు వచ్చే ఈ బంకులో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.అధికారులు చర్యలు తీసుకోవాలి కోరుతున్నారు నిబంధనల ప్రకారం పెట్రోల్ బంకుల్లో ఉచిత గాలి సౌకర్యాన్ని పునరుద్ధరించేలా సంబంధిత ఆయిల్ కంపెనీ అధికారులు మరియు పౌరసరఫరాల శాఖ అధికారులు తక్షణమే స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని ధర్పల్లి మండల ప్రజలు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

## కొత్తగూడెంలో నేత్రపర్వంగా పోచమ్మ తల్లి బోనాల జాతర...

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 23, నేటి శుభోదయ :**
శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కొత్తగూడెంలో శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవస్థానం ఆధ్వర్యంలో బోనాల జాతరను వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పల్లా రాజనర్సు ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు.జాతరలో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై కొలువుదీర్చి పట్టణంలో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, కోలాటాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను



అలరించాయి. అమ్మవారి వివిధ వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.మహిళలు భక్తిశ్రద్ధలతో శిరస్సుపై బోనాలు ధరించి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్పూర



హారతులతో మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా కొత్తగూడెం పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# గాంధీ ఆస్పత్రి వద్ద పేదలకు అన్నదానం

- **రెడీ టూ సర్వ్' ఫౌండేషన్ అమ్మ హెల్పింగ్ హాండ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సేవ**



**హైదరాబాద్, ఆగస్టు 23, నేటి శుభోదయ :** గాంధీ ఆస్పత్రి వద్ద వద్ద రెడీ టూ సర్వ్' ఫౌండేషన్ – అమ్మ హెల్పింగ్ హాండ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి వద్ద చికిత్స కోసం వచ్చిన పేద రోగులు, వారి కుటుంబ సభ్యులు, అవసరమైన వారికి సుమారు 300 మందికి ఉచితంగా భోజనం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు, వాలంటీర్లు స్వచ్ఛందంగా సేవలందిస్తూ వందలాది మందికి ఆహారం అందించారు. ఆస్పత్రుల వద్ద చికిత్స కోసం నిరీక్షించే పేద రోగులు, వారి కుటుంబ సభ్యులకు ఈ అన్నదానం ఎంతో ఉపయోగకరంగా మారిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. 'రెడీ టూ సర్వ్' ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు.ఈ సేవ కార్యక్రమంలో స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ ఆంజనేయ ప్రసాద్, స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియావైదేహీనగర్ బ్రాంచ్ డిప్యూటీ మేనేజర్ బి. శ్రీరామ కృష్ణ, రిటైర్డ్ ఏజీఎం ఎస్బిఐ ఎం. నాగమోహన్, యాక్టర్ విజయ భాస్కర్, తదితరులు పాల్గొని ఆహారం వడ్డించారు.సమాజంలో ఆకలితో బాధపడుతున్న వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.పేద ప్రజల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించనున్నట్లు వెల్లడించారు. ఈ సేవా కార్యక్రమంలో పలువురు స్వచ్ఛందంగా వాలంటీర్లుగా పాల్గొని, స్వయంగా ఆహారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు పెద్ది శంకర్ మాట్లాడుతూ, సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలనుకునే దాతలు, స్వచ్ఛంద సేవకులు తమను సంప్రదించాలని కోరారు. సమాజ సేవలో మరింత మంది భాగస్వాములు కావడం ద్వారా అవసరమైన వారికి మరింత విస్తృతంగా సహాయం అందించగలమని ఆయన పేర్కొన్నారు.

# చెత్తకుప్పల ప్రాంతం.. నేడు పచ్చని వనం....

- **10 నెలల్లో 5 ఎకరాల్లో 10 వేల మొక్కలు నాటిన సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ....**
- **కరకట్టను పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దిన అధికారులు...**





**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 23, నేటి శుభోదయ :** శ్రీ సీతారామచంద్రస్వామి కొలువైన భద్రాచలానికి దేశ, విదేశాల నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారని, వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో కరకట్ట పరిసరాలను పచ్చదనంతో తీర్చిదిద్దినట్లు భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తెలిపారు.గతంలో భద్రాచలం కరకట్ట చివరి ప్రాంతంలో చెత్త, వ్యర్థాలను డంపింగ్ చేయడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లేదని తెలిపారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించే చర్యలు చేపట్టినట్లు వివరించారు.గతంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి చొరవతో జీపీ సిబ్బంది చెత్తను పూర్తిగా తొలగించి పరిసరాలను శుభ్రం చేశారని తెలిపారు. అనంతరం సుమారు 10 నెలల కాలంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో 10 వేల మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను చేపట్టడంతో ప్రస్తుతం ఆ ప్రాంతం పచ్చని గడ్డితో, ఆహ్లాదకరమైన వాతావరణంతో కళ కళలాడుతోందన్నారు.గతంలో చెత్త డంపింగ్ యార్డును తలపించిన ప్రాంతం నేడు పచ్చని వనంగా మారడంతో స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గోదావరి స్నానఘట్టాలకు వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తీసుకున్న చర్యలను స్థానికులు అభినందిస్తున్నారు.చెత్తకుప్పలతో దుర్వాసన వెదజల్లిన ప్రాంతాన్ని పరిశుభ్రంగా మార్చి, పచ్చదనంతో నిండిన ప్రాంతంగా తీర్చిదిద్దినందుకు సబ్ కలెక్టర్‌ను స్థానికులు ప్రశంసిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు సమన్వయంతో ఇలాంటి పరిశుభ్రత, పచ్చదనం కార్యక్రమాలను కొనసాగిస్తే భద్రాచలం మరింత సుందరంగా మారుతుందని వారు ఆకాంక్షిస్తున్నారు.

# భద్రాచలంలో 6.130 కిలోల గంజాయి పట్టివేత...



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 23, నేటి శుభోదయ :** భద్రాచలంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 6.130 కిలోల ఎండు గంజాయి పట్టుబడింది. కూనవరం నుంచి భద్రాచలం వెళ్లే మార్గంలో ఇసుక రీచ్ వద్ద శనివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనం (ఓడి 10 వి 5439)ను ఆపి తనిఖీ చేయగా గంజాయి లభించింది.ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కన్‌గిరి జిల్లా నుయాగూడకు చెందిన సుభాన్ ధనాపుల్, నబరంగ్‌పూర్ జిల్లా పండికోట్‌కు చెందిన ఉదయ హరిజన్ మల్కన్‌గిరి నుంచి భద్రాచలానికి గంజాయిని తరలిస్తుండగా పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 6.130 కిలోల ఎండు గంజాయితో పాటు ద్విచక్ర వాహనం, రెండు సెలఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.4.51 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ సీహెచ్. శ్రీహరిరావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. స్వాధీనం చేసుకున్న గంజాయి, వాహనం, సెల్‌ఫోన్లను తదుపరి విచారణ నిమిత్తం భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు రమేశ్‌బాబు, వెంకన్న, ప్రసన్నకుమార్, తిరుపతి, ఉపేందర్ పాల్గొన్నారు.గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఉంటే 18004252523 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో చౌడమ్మ పోచమ్మ బోనాల ఉత్సవాలు

**కేశంపేట, నేటి శుభోదయ :** కొండారెడ్డిపల్లిలో ఘనంగా బోనాల వేడుకలు – పాల్గొన్న సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్ కొండారెడ్డిపల్లి గ్రామంలో యాదవ సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన చౌడమ్మ, పోచమ్మ బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామ మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్ హాజరై చౌడమ్మ, పోచమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవార్ల దీవెనలు కొండారెడ్డిపల్లి గ్రామంపై, గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని కోరుకున్నారు.బోనాల ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళలు, యాదవ సోదరులు, గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను



విజయవంతం చేశారు. అమ్మవార్ల ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని భక్తులు కోరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# సిరికొండ, ధర్పల్లి మండలాల బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుల నియామకం






**నిజామాబాద్ రూరల్ సిరికొండ, ఆగస్టు 23, నేటి శుభోదయ** సిరికొండ, ధర్పల్లి మండలాల బీజేపీ కిసాన్ మోర్చా నూతన అధ్యక్షులను ఆదివారం నియమించారు. సిరికొండ మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా చౌటుపల్లి ప్రభాకర్, ధర్పల్లి మండల అధ్యక్షుడిగా హొన్నాజీపేట గ్రామానికి చెందిన మైలారం రఘుపతి రెడ్డి నియమితులయ్యారు.ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు దినేష్ కులాచారి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి మరియు జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి చేతుల మీదుగా నూతన అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతనంగా ఎన్నికైన వారికి అభినందనలు తెలియజేశారు. అనంతరం రఘుపతిరెడ్డి మాట్లాడుతూ... రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, రైతులకు అందుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# ఆపదలో ఉన్న కుటుంబాలకు యువ చైతన్య ట్రస్ట్ అండ





**వికారాబాద్ ఆగస్టు 23 , నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లాబంట్వారం: వికారాబాద్ నియోజకవర్గ పరిధిలోని బంట్వారం మండలం రోంపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను యువ చైతన్య ట్రస్ట్ చైర్మన్ ఎం. చైతన్య కిరణ్ పరామర్శించి, తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ మొత్తం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.గ్రామానికి చెందిన జనుముల లాలప్ప అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించిన చైతన్య కిరణ్ రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా హన్మప్ప మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఆయన కుటుంబానికి మరో రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి యువ చైతన్య ట్రస్ట్ ఎల్లవేళలా అండగా ఉంటుందని చైతన్య కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీనివాస్‌తో పాటు ట్రస్ట్ నాయకులు మల్లేశం, ప్రవీణ్, నర్సింలు, నరేష్, వెంకట్, రాములు, యూసుఫ్, కావలి శ్రీను, జనార్ధన్, సిహెచ్. రాజు, అంజయ్య, నాగాయితో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకల్లో పాల్గొన్న బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి



**కొత్తపేట, ఆగస్టు,23, నేటి శుభోదయ :** కొత్తపేట డివిజన్ పరిధిలోని మోహన్ నగర్ చౌరస్తా వద్ద బోనాల పండుగ సందర్భంగా బీజేపీ రంగారెడ్డి జిల్లా (అర్బన్) ప్రధాన కార్యదర్శి యాష్ పాల్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి ఘట్టం మరియు బంగారు బోనం కార్యక్రమంలో బీజేపీ రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య గారితో పాటు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వానిపల్లి శ్రీనివాస్ రెడ్డి, భారర్ గౌడ్, మంచూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి మరియు బీజేపీ జిల్లా నాయకులు, సీనియర్ నాయకులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పండుగల సాయన్న విగ్రహ ప్రతి ష్ఠాపనకు భూమిపూజ



**వికారాబాద్, ఆగస్టు 23, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరు గాంచిన బడుగు, బలహీన వర్గాల నాయకుడు పండుగల సాయన్న విగ్రహ ప్రతిష్ఠాపనకు కుల్కచర్ల మండలం కామునిపల్లిలో భూమిపూజ నిర్వహించారు. ముదిరాజ్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంఘం నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.పండుగల సాయన్న విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేయడం పట్ల ముదిరాజ్ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సాయన్న ఆశయాలు, సామాజిక సేవలను ప్రజలకు తెలియజేసేలా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భూమిపూజ కార్యక్రమాన్ని స్థానికులు ఆసక్తిగా వీక్షించారు.ఈ కార్యక్రమంలో కామునిపల్లి సర్పంచ్ సత్యమ్మ వెంకటయ్య ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## జన సమితి కార్యాలయంలో ఘనంగా బోనాల వేడుకలు



**నాంపల్లి, ఆగస్టు 23, నేటి శుభోదయ :** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు చిహ్నమైన బోనాల వేడుకలు తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. నాంపల్లి టీజేఎస్ కార్యాలయంలో మహిళా జన సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పుష్పనీల ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని బోనాలు చెల్లించారు. పోతురాజుల విన్యాసాలతో అంగరంగ వైభవంగా జరిగాయి.బోనాల వేడుకలకు ముఖ్యఅతిథిగా గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఎం నరసయ్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు తెలంగాణ సంస్కృతిని అందించడమే బోనాల ప్రత్యేకత అని కొనియాడారు. బోనాల వేడుకల ద్వారా ప్రజల మధ్య ఐక్యత, ప్రేమాభిమానాలు మరింత పెరగడానికి దోహదం చేస్తాయని ఉపయోగపడ్డారు. ఈ సందర్భంగా కార్యాలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో కార్యాలయ ఇన్చార్జి హనుమంత రెడ్డి, రాష్ట్ర నాయకులు సర్దార్ వినోద్ కుమార్, జిహెచ్ఎంసి ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలరాజు, కార్యదర్శి కృష్ణ,తెలంగాణ ఉద్యమ నాయకురాలు జానకి రెడ్డి, మహిళా జన సమితి రాష్ట్ర నాయకురాలు మెదక్ సక్కుబాయి , రేఖ, ఉష, స్వాతి, శాంతి, పద్మ,పెంటమ్మ, చంద్రకళ,సుగుణమ్మ, సబితమ్మ, కవిత, జలిజమ్మ, మహాలక్ష్మి ,పుష్ప,ఎం లక్ష్మి ,డి లక్ష్మి నగర నాయకులు హనుమంత్ గౌడ్, జయపాల్ రెడ్డి కాకునూరి సుధాకర్,సురేష్ కుమార్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.పోతురాజుల విన్యాసాలతో బోనాల ఊరేగింపు గాంధీ భవన్ సమీపంలోని అమ్మవారి దేవాలయంకు చేరుకున్న అనంతరం మహిళలు బోనాలు చెల్లించారు.

## అంగన్వాడీ పోస్టుల ఎంపిక పారదర్శకంగా
## దళారులను నమ్మి మోసపోవద్దు
### - జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా




**భద్రాద్రికొత్తగూడెం, ఆగస్టు 23, నేటి శుభోదయ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అంగన్వాడీ టీచర్లు, సహాయకుల పోస్టుల భర్తీకి చేపట్టిన ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా తెలిపారు.పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, అధికారులతో పరిచయాలు ఉన్నాయని చెప్పే వ్యక్తులను నమ్మి డబ్బులు చెల్లించవద్దని హెచ్చరించారు.జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిర్దేశిత అర్హతలు, రిజర్వేషన్ నిబంధనలు, మెరిట్ ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు.ఎవరికి ఉద్యోగం వస్తుందో ముందుగా ఎవరికీ తెలియదని, ఎంపిక పూర్తిగా నిబంధనల ప్రకారమే జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా అధికారిక ప్రక్రియపై మాత్రమే ఆధారపడాలని సూచించారు.వచ్చే వారంలో అంగన్వాడీ టీచర్లు, సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ముఖాముఖి (ఇంటర్వ్యూ) నిర్వహించే అవకాశం ఉందని, ఇందుకు సంబంధించిన వివరాలను అధికారికంగా వెల్లడిస్తామని జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా తెలిపారు.

## ఫసల్ బీమా అమలు చేయాలి : కర్రెడ్ల నరేందర్ రెడ్డి



**కేశంపేట, ఆగస్టు 23, నేటి శుభోదయ :** కేంద్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలిచేందుకు తీసుకొచ్చిన ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేయాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా సాంస్కృతిక శాఖ కో–కన్వీనర్ కర్రెడ్ల నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు, పంట నష్టాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు.రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నరేందర్ రెడ్డి విమర్శించారు. పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే సరైన నష్టపరిహారం అందించాలని కోరారు. గత వర్షాకాలంలో పంటలు నష్టపోయిన అనేక మంది రైతులు అప్పుల బాధల్లో కూరుకుపోయారని తెలిపారు. పరిహారం అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా ఇప్పటివరకు పూర్తి స్థాయిలో చెల్లింపులు జరగకపోవడం బాధాకరమన్నారు.ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఫసల్ బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు గతంలో పంట నష్టపోయిన రైతులకు పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను గుర్తించి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంలో ఫసల్ బీమా కీలకమని, పంట నష్టాల సమయంలో రైతులు అప్పుల పాలుకాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని నరేందర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో అల్లం ప్రతాప్ రెడ్డి, శంకర్ రెడ్డి, వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

## సమయం ముగిసినా తెరిచే ఉన్న కుల్కచర్ల తహశీల్దార్ కార్యాలయం
### : అర్ధరాత్రి వేళల్లో అధికారుల తీరుపై ప్రజల అనుమానాలు

**వికారాబాద్, ఆగస్టు 23 , నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల తహశీల్దార్ కార్యాలయం పనివేళలు ముగిసినప్పటికీ అర్ధరాత్రి వరకు తెరిచి ఉండటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పగటిపూట తమ పనుల కోసం కార్యాలయానికి వచ్చే రైతులకు, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండని అధికారులు, రాత్రి వేళల్లో బయటి వ్యక్తులతో కలిసి ఆఫీసులో ఏం చేస్తున్నారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ శాఖలో డబ్బులు ఇస్తేనే పనులు చేస్తున్నారని, రాత్రి వేళల్లో కార్యాలయంలో రహస్య లావాదేవీలు సాగిస్తున్నారని స్థానికులు, రైతులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.ప్రజా సేవ చేయాల్సిన అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ, అర్ధరాత్రి వేళల్లో ఆఫీసులో కార్యకలాపాలు నిర్వహించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై రెవెన్యూ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కార్యాలయంలోని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు



## వరంగల్ తూర్పు కాంగ్రెస్‌లో విభేదాల సెగ

- **నేతల ఘాటు విమర్శలు..**
- **క్షమాపణలకు డిమాండ్.. బహిరంగంగా అసంతృప్తి**



**వరంగల్ , ఆగస్టు 23, నేటి శుభోదయ :** వరంగల్ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. వరంగల్ తూర్పు కాశీబుగ్గ ప్రాంతంలోని 20వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ రాంకీ ఆయన స్వగృహంలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నల్గొండ రమేష్, మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**సుస్మిత పటేల్ క్షమాపణ చెప్పాలి ...** పరమేశ్యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరమేశ్ మాట్లాడుతూ.. సుస్మిత పటేల్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీలను అణగదొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, పార్టీ కార్యకర్తలపై కేసులతో భయపెట్టే రాజకీయాలకు స్వస్తి పలకాలని మండిపడ్డారు. బీసీ కార్డుతో తప్పులను కప్పిపుచ్చుకోవడం ఇక చెల్లదని స్పష్టం చేశారు.

**కొండా దంపతుల తీరుతో పార్టీకి నష్టమే**
నల్గొండ రమేష్కాంగ్రెస్ నాయకుడు నల్గొండ రమేష్ మాట్లాడుతూ.. కొండా సురేఖ విధానాలతో కాంగ్రెస్‌కు నష్టం జరుగుతోందని ఆరోపించారు. ముఖ్యమంత్రిపై చేసిన వ్యాఖ్యలకు కొండా దంపతులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీలను అడ్డం పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందడం మానుకోవాలని, బీసీ నాయకులపై కేసులతో అణచివేతకు పాల్పడటం సరికాదని అన్నారు.ఏ హోదాతో టికెట్లు ప్రకటిస్తున్నారు.?గుండేటి నరేందర్మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్ మాట్లాడుతూ.. కొమ్మాల జాతరలో కొండా మురళి చేసిన ప్రకటనలను ప్రశ్నించారు.

**"ఏ హోదాతో టికెట్లు, అభ్యర్థుల ప్రకటనలు చేస్తున్నారు?"** అంటూ నిలదీశారు. కొండా సురేఖను వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.బీసీ కార్డుతో రాజకీయాలు చేయడం ఇక చెల్లదు.. పార్టీ క్రమశిక్షణను ధిక్కరిస్తే ఎంతటి వారినైనా ప్రశ్నిస్తాం అంటూ నరేందర్ ఘాటుగా వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బస్వరాజ్ కుమారస్వామి,గోరంటాల రాజు,సదానందం,నారగోని మురళి గౌడ్,నారగోని స్వప్న, సోమ లక్ష్మి , ఎల్ శ్రీనివాస్ ఎంబాడి అమేరేందర్,ఎండి సలీం,కొమ్మల సందీప్, నాగుబోతు మురళీమోహన్,నీలం మధు,ఇనుగాల బాబు, బత్తుల వినోద్, కూచన రవీందర్,యూత్ కాంగ్రెస్ నాయకులు,డివిజన్ అధ్యక్షులు,కార్యకర్తలు ఉన్నారు.ముగ్గురు నాయకుల వరుస విమర్శలతో వరంగల్ తూర్పు కాంగ్రెస్‌లోని అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. వారి వ్యాఖ్యలు నియోజకవర్గ కాంగ్రెస్ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.

## భక్తిశ్రద్ధలతో బీరప్ప స్వామికి బోనాలు

**మిడ్జిల్ ఆగస్టు 23, నేటి శుభోదయ :** మిడ్జిల్ మండలం దోనూర్ గ్రామంలో బీరప్ప స్వామి బోనాల ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు ఎత్తుకుని ఆలయానికి చేరుకుని బీరప్ప స్వామికి సమర్పించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బీరప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన భక్తులు తమ కుటుంబాలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తుల సందడితో కళకళలాడాయి.బోనాల ఊరేగింపులో మహిళల సంప్రదాయ వేషధారణలు, భక్తుల జయజయధ్వానాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా పోతురాజుల విన్యాసాలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోతురాజుల నృత్యాలు, విన్యాసాలను చూసేందుకు భక్తులు ఆసక్తి చూపారు. దీంతో



గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడంతో బీరప్ప స్వామి బోనాల ఉత్సవాలు కన్నులపండువగా సాగాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, పాలక బృందం, యాదవ సంఘం నాయకులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేదలకు ఆర్థిక భరోసా

- **60వేల చెక్కు అందజేసిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి**
- **కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరు**



**తలకొండపల్లి, ఆగస్టు 23, నేటి శుభోదయ :** ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నిరుపేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తోందని తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, లింగరావుపల్లి గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం లింగరావుపల్లి గ్రామానికి చెందిన బొచ్చుపల్లి పెద్ద జంగయ్య వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుండి రూ. 60,000 మంజూరయ్యాయి.కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక సహకారంతో విడుదలైన ఈ చెక్కును ఆదివారం శ్రీనివాస్‌రెడ్డి చేతులమీదుగా లబ్ధిదారుడికి అందజేశారు.ఈ సందర్భంగా కాసు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు భరోసా కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామని స్పష్టం చేశారు. మండల పరిధిలో ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక సాయం కావాల్సిన వారు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందేలా కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు భాస్కర్ రెడ్డి, పోతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి,బసప్ప, శేఖర్ గౌడ్, యాదయ్య, జంగయ్య,శ్రీధర్,రబ్బానీ, శివారెడ్డి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు

# వాటర్ వర్క్స్ నిర్లక్ష్యంతో డంపింగ్‌గా మారిన గుంత



**వికారాబాద్ ఆగస్టు 23, నేటి శుభోదయ :** పట్టణంలోని అస్సాం బేకరీ వెనుక వీధిలో వాటర్ వర్క్స్ సిబ్బంది వాల్ నిర్మాణం కోసం తీసిన గుంతను పనులు పూర్తయిన అనంతరం పూడ్చకుండా వదిలేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. కొంతకాలంగా గుంతలో గడ్డి పెరగడంతో పాటు స్థానికులు చెత్తను వేస్తుండటంతో అది క్రమంగా డంపింగ్ స్థలంగా మారింది.ఈ సమస్యను మున్సిపల్ సిబ్బందికి, వాటర్ వర్క్స్ అధికారులకు పలుమార్లు తెలియజేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలో చెత్త పేరుకుపోవడంతో దోమలు విపరీతంగా పెరగడంతో పాటు పాములు సంచరిస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వర్షాకాలంలో గుంతలో నీరు నిలిచి మరింత దుర్వాసన, దోమల సమస్య తలెత్తే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు తక్షణమే స్పందించి గుంతను పూడ్చడంతో పాటు చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా
# ముత్యాలమ్మ బోనాల పండుగ నిర్వహణ

**ఖమ్మం, ఆగస్టు 23, నేటి శుభోదయ :** గంగపుత్ర సంఘం, జూబ్లీ పుర, సారధి నగర్ వారి ఆధ్వర్యంలో ముత్యాలమ్మ బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం కొనసాగుతున్న ఆనవాయితీ, సంప్రదాయాలను పాటిస్తూ భక్తిశ్రద్ధలతో ఈ బోనాల వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, నెత్తిన బోనాలను ఎత్తుకుని భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా బయలుదేరారు. యువకులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని మేళతాళాలు, డప్పు చప్పుళ్లతో జూబ్లీ పుర, సారధి నగర్ పురవీధుల్లో ఉత్సాహభరితంగా ఊరేగింపు నిర్వహించారు. భక్తుల జయ జయధ్వానాలు, అమ్మవారి నామస్మరణలతో పరిసర ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.అనంతరం ఊరేగింపు ముత్యాలమ్మ గుడి సెంటర్‌కు చేరుకోగా మహిళలు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నారు.ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం జూబ్లీ పుర, సారధి నగర్ అధ్యక్షులు కన్నం రమేష్, ప్రధాన కార్యదర్శి గోధుమల శ్రీనివాసరావు, కోశాధికారి సోమనబోయిన కుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ముత్యాలమ్మ బోనాల పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ప్రత్యేకంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలను అమ్మవారు చల్లగా చూడాలని, ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలని కోరుతూ ప్రత్యేక మొక్కులు చెల్లించినట్లు తెలిపారు. ప్రజలందరూ ఐకమత్యంతో, సోదరభావంతో పండుగలను నిర్వహించుకోవాలని, మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులతో జూబ్లీ పుర, సారధి నగర్ ప్రాంతాలతో పాటు ఖమ్మం నగర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి ఇంట అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కన్నం ప్రసన్న కృష్ణ, నగర అధ్యక్షులు చేతి కృష్ణ, మాజీ కార్పొరేటర్ కన్నం వైష్ణవి, మాజీ కౌన్సిలర్స్ వంగాల వెంకట్, సింగం అంజయ్య, నాయకులు గోధుమల ఉపేందర్, కన్నం రాజేందర్, వడ్డెబోయిన బిక్షపతి,చేతి శ్రీనివాస్,



నరుగుల ఆనంద్, కన్నం రవీందర్, పూజారి రాజు, సోమనబోయిన సత్యం, అంబటి రఘుబాబు, నరుగుల రవికుమార్, కన్నం నరేందర్, నరుగుల బలరాం శంకర్, కన్నం చంద్రశేఖర్ , డోలి ప్రేమ్ సాగర్, సింగారపు త్రినాధ్, మైస కుమారస్వామి, తవిడబోయిన వీరేంద్ర, తవిడ బోయిన శ్రీనివాస్, పూజారి రాజు, టుంగుటూరి నర్సింగరావు, నరుగుల రాజేష్, కన్నం రాము, వంగల రోహిత్ తదితరులు పాల్గొన్నారు.బోనాల వేడుకల్లో మహిళలు, యువత, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో జూబ్లీ పుర, సారధి నగర్ ప్రాంతం పండుగ శోభను సంతరించుకుంది. భక్తుల సంతోషోత్సాహాల మధ్య ముత్యాలమ్మ బోనాల పండుగ వేడుకలు ఘనంగా ముగిశాయి.

# ఘనంగా చిన్నారుల నూతన వస్త్రాలంకరణ కార్యక్రమం

**-చిన్నారులను ఆశీర్వదించిన నాయకులు**



**తలకొండపల్లి, ఆగస్టు 23, నేటి శుభోదయ :** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన గోద సరిత,ఆంజనేయులు యాదవ్ దంపతుల కూతురు, కుమారుల నూతన వస్త్రాలంకరణ (అంగీకార) మహోత్సవం మిడ్జిల్ మండల కేంద్రంలోని టీ.ఆర్.ఆర్ ఫంక్షన్ హాల్‌లో అత్యంత వైభవంగా జరిగింది.ఈ వేడుకకు వెల్జాల్ గ్రామ మాజీ ఎంపీటీసీ ఎం.అంబాజి, మాజీ ఉపసర్పంచ్‌లు బి.నర్సింలు, అజీజ్, కృష్ణయ్య గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.కార్యక్రమంలో పాల్గొన్న వారు నూతన వస్త్రాలు ధరించిన చిన్నారులను ఆశీర్వదించి,దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మిడ్జిల్ మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ జహీర్, గ్రామ ప్రముఖులు ఎండి మన్నాన్,రిజ్వాన్,హసీబ్, కే. నరసింహలతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, వెల్జాల్ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారులను దీవించారు.

# 40 ఏళ్ల నాటి మున్సిపల్ భవనం.. ఎప్పుడు ఏ ప్రమాదమో!

- **శిథిలావస్థలో కార్మికుల కార్యాలయం..**
- **అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం**

**వరంగల్, ఆగస్టు 23, నేటి శుభోదయ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 38వ డివిజన్ ఖిలా వరంగల్ లో చమన్ సమీపంలోని మున్సిపల్ కార్యాలయ భవనం దయనీయ స్థితికి చేరుకుంది. సుమారు 40 ఏళ్లుగా కొనసాగుతున్న పాత భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని కార్మికుల భద్రతకు ముప్పుగా మారుతోంది.ఏళ్ల తరబడి మరమ్మతులతో నెట్టుకొస్తున్న ఈ భవనం పరిస్థితిపై అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కార్మికుల కోసం నిర్మించిన భవనమే వారికి ప్రమాదకరంగా మారితే ఇక అధికారులు స్పందించేది ఎప్పుడు? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.విధులు నిర్వహించేందుకు వచ్చే మున్సిపల్ కార్మికులకు కనీస సౌకర్యాలు, భద్రత కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంటున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే పరిస్థితి కాకుండా.. ప్రమాదం జరగకముందే మేల్కొనాలని కోరుతున్నారు.ప్రజలకు సేవలందించే మున్సిపల్ కార్మికులే శిథిల భవనంలో విధులు నిర్వహించడం విచారకరమని, ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు కళ్లుతెరిచి వాస్తవ పరిస్థితిని పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకుని పాత భవనాన్ని పరిశీలించి, అన్ని సౌకర్యాలు, భద్రతా ప్రమాణాలతో నూతన భవన నిర్మాణానికి తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదం కోసం ఎదురుచూడకుండా.. కార్మికుల ప్రాణాలకు విలువనిచ్చి ఇప్పుడే నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.



# భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు రోజులపాటు ఎన్‌సీఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన...





**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 23, నేటి శుభోదయ :** జాతీయ ఎన్‌సీఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ ఈ నెల 24, 25 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు రోజులపాటు పర్యటించనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.24వ తేదీ ఉదయం 10.30 గంటలకు కొత్తగూడెంలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌కు చేరుకోనున్న కమిషన్ సభ్యుడు, 11.30 గంటల వరకు లక్ష్మీదేవిపల్లి మండలం కూనారం గ్రామంలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అశ్వాపురం మండలంలోని హెవీ వాటర్ బోర్డు కాన్ఫరెన్స్ హాల్‌లో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సీనియర్ అధికారులు, గిరిజన ఉద్యోగులు, గిరిజన సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించనున్నారు. 25వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులతో సమావేశమై గిరిజనులకు సంబంధించిన పెండింగ్ కేసులపై సమీక్షించనున్నారు.ఎన్‌సీఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన సందర్భంగా విధులు కేటాయించిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు ప్రత్యేక బాధ్యతలు తీసుకుని ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ సూచించారు.

## ఉపకార వేతనాలు అందుకకున్న విద్యార్థులతో నిర్వాహకులు

- ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందిస్తాయి- జయపాల్




**సికింద్రాబాద్, ఆగస్టు 23, నేటి శుభోదయ :** లక్షల రూపాయలతో విద్యార్థులను ప్రోత్సహించడం అనేది పేద, మధ్య తరగతి కుటుంబాలకు పెద్ద ప్రోత్సాహం అని హైకోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జయపాల్ అన్నారు. ఆదివారం సికిందాబ్రాద్ పీజీ రోడ్డులోని ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం అధ్వర్యంలో సంఘ భవనంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు 18 లక్షల రూపాయల విలువ గల చెక్కులను ఉపకార వేతనాల రూపంలో అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన జయపాల్ మాట్లాడుతూ.... భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరికీ చదువుకునే హక్కు ఉందని, అందుకు సహకారం అందిస్తున్న సంఘ సభ్యులందరినీ అభినందించారు. చాలా సంస్థలు తమ సొంత కమ్యూనిటీకి మాత్రమే సహాయ చేస్తాయని, కానీ ఈ సంఘం చాలా ప్రత్యేకమైనదని, సెక్యూలర్ స్వభావం కలిగినదని. కేవలం ఆర్యవైశ్య కమూనిటీ విద్యార్థులకు మాత్రమే కాకుండా అన్ని కులాలు, మతాలకు చెందిన విద్యార్థులకు సహాయం చేయడం గొప్ప విషయమాని కొనియాడారు. ఈ ఉపకారవేతనాలను 85 శాతం కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకున్న మెరిట్ విద్యార్థులకు మాత్రమే ఇస్తున్నారని, కష్టపడి చదివితేనే ఈ ప్రతిఫలం దక్కుతుందని, మంచి విద్యతో మంచి పౌరులుగా ఎదిగి దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. స్కాలర్షిప్స్ కమిటీ చైర్మన్ వీసంశెట్టి ప్రేమ్ సాగర్ మాట్లాడుతూ..... 52 సంవత్సరాలుగా ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచే పేద విద్యార్థులకు ప్రోత్సహకంగా ఉపకారవేతనాలను అందిస్తున్నట్లు ఈ సంవత్సరం ఎంబిబిఎస్, బిటెక్, డిగ్రీ తదితర ఉన్నత విద్యను అభ్యసించే 40 మంది విద్యార్థులకు 18 లక్షల రూపాయలను అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గౌరవ అతిధిగా సుప్రియ. సంఘ అధ్యక్షులు సోమ ఆనంద్. కార్యదర్శి చీల విజయ్ కుమార్, కోశాధికారి ముస్త్యాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా ఉమ్మడి రేగొండ ప్రెస్క్లబ్ అధ్యక్షుడిగా పట్టేం కోటి

- జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారమే లక్ష్యం : పట్టేం కోటి



**వరంగల్ ,ఆగస్టు 23, నేటి శుభోదయ** రేగొండ మండల కేంద్రంలో ఆదివారం ఉమ్మడి రేగొండ ప్రెస్క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. అడక్ కమిటీ సభ్యులు కటకం రాజు, అంబాల రవీందర్, బండి సోమయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలకు అక్రిడిటేషన్, పీడీఎఫ్, యూట్యూబ్, డిజిటల్ మీడియాకు చెందిన మొత్తం 33 మంది జర్నలిస్టులకు గాను 21 మంది హాజరయ్యారు.ఈ ఎన్నికల్లో ఉమ్మడి రేగొండ ప్రెస్క్లబ్ మండల అధ్యక్షుడిగా పట్టేం కోటిని జర్నలిస్టులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు పట్టేం కోటి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన జర్నలిస్టులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.నూతన కార్యవర్గంగౌరవ అధ్యక్షుడు: కటకం రాజుగౌరవ సలహాదారు: బోట్ల ప్రవీణ్ప్రధాన కార్యదర్శి: పకిడే నవీన్ఉపాధ్యక్షులు: రోంటాల శంకర్, బండారి రాజుకోశాధికారి: బండి కమలాకర్సహాయ కార్యదర్శులు: మోటం రాజు, మంతెన మధు,సంయుక్త కార్యదర్శి: బండారి తిరుపతిప్రచార కార్యదర్శి: గునుకంటి రాకేష్కార్యవర్గ సభ్యులుబొమ్మకంటి నవత్, మ్యాదరబోయిన రాజు, మార్తా రాజు తదితరులు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో ఎండీ. రహీం, మంతెన సురేష్, అక్కల రమేష్, అమ్మ పవన్ తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఖానాపూర్‌లో ఆధ్యాత్మిక వైభవం..
## పోచమ్మ తల్లి ఆలయ ప్రతిష్టాపన మహోత్సవం

- గ్రామాల్లో భక్తిభావం, ఐక్యత పెరగాలి : ఎమ్మెల్యే కసిరెడ్డి
- ఘనంగా దాత గోగికార్ రమేష్ దంపతుల సత్కారం....
- లోకకల్యాణం కోసమే ప్రతిష్ఠా కార్యక్రమాలు
- ఖానాపూర్‌లో వైభవంగా పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన
- హాజరైన ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు



**తలకొండపల్లి, ఆగస్టు 23, నేటి శుభోదయ :** తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ గ్రామాల్లో దేవాలయాలను నిర్మించడం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహించడం పూర్వజన్మ సుకృతం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల వల్ల ప్రజల్లో భక్తిభావం, ఐక్యత మరింత పెంపొందుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.తలకొండపల్లి మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి దేవాలయ శిఖర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.తెలంగాణ టాస్క్ నీట్ సిబ్బంది సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు బాలరాజ్ సింగ్,జాతీయ ఓ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారితో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.దాతల సేవలు అభినందనీయం..ఖానాపూర్ గ్రామానికి చెందిన దాత గోగికార్ రమేష్ తమ గ్రామంపై ఉన్న మమకారంతో లక్షలాది రూపాయలు వెచ్చించి ఈ పోచమ్మ తల్లి ఆలయాన్ని అత్యంత సుందరంగా నిర్మించడం అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు.స్థానిక సర్పంచ్ అనితా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రతిష్ఠా మహోత్సవం ఊరిలో పండుగ వాతావరణాన్ని తీసుకువచ్చిందన్నారు.దాత రమేష్ దంపతులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సత్కరించారు. రమేష్ స్ఫూర్తితో మరికొంత మంది దాతలు ముందుకువచ్చి గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి హామీస్థానిక పూజారులు, గ్రామ నాయకుల విజ్ఞప్తి మేరకు ఖానాపూర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయంతో పాటు గణపతి దేవాలయ నిర్మాణానికి కూడా తన వంతు సహకారాన్ని అందిస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సానుకూలంగా హామీ ఇచ్చారు. కాగా, వేద పండితులు శ్యాంసుందర్ శర్మ, వెంకటేశ్వర శర్మ, సిద్ధార్థ శర్మ, గణపతి శర్మ, గౌతమ్ శర్మల ఆధ్వర్యంలో హోమాలు, యంత్ర పూజలు, విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలను వేద మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు.తరలివచ్చిన భక్తులు..నాయకులుఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి, అంబటి శివలింగం, శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గీతా నరసింహ, మాజీ జెడ్పీటీసీ పద్మ నరసింహ, మాజీ ఎంపీటీసీ గణేష్ గుప్తా, సర్పంచులు చంద్రశేఖర్, కళావతి, రాము లక్ష్మణ్, రమేష్, శంకర్ నాయక్, వివిధ గ్రామాల ముఖ్య నాయకులు భగవాన్ రెడ్డి, నరసింహారెడ్డి, ఏమిరెడ్డి రంగారెడ్డి, రాజేంద్ర నాయక్, నరసింహ, యాదయ్య గౌడ్, అయోధ్య, దామోదర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, జైపాల్ తో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఆలయ ప్రాంగణం మహిళల కోలాటాలు, భక్తి కీర్తనలతో మార్మోగింది

## ఆగస్టు 27న టిజిఈజేఏసి మహాధర్నాను విజయవంతం చేయాలి

- ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కాంట్రాక్టు,ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఐక్య ఉద్యమానికి ఖమ్మం జిల్లా నుంచి సంపూర్ణ మద్దతు





**ఖమ్మం, ఆగస్టు 23, నేటి శుభోదయ :** ఆగస్టు 27న ఖమ్మం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న టిజిఈజేఏసి మహాధర్నాను విజయవంతం చేయాలని టిజిఈజేఏసి రాష్ట్ర సెక్రటరీ జనరల్, టిజిఓస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.టిజిఈజేఏసి ఖమ్మం జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలోని టిఎన్జీఓస్ భవన్‌లో అన్ని ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు, ఉపాధ్యాయ సంఘాలు, పెన్షనర్ సంఘాలు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగ సంఘాల నాయకులు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టిజిఈజేఏసి ఖమ్మం జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా ఏలూరి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఉద్యోగ సంఘాల నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, వర్కర్లు, పెన్షనర్లు, కాంట్రాక్టు మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం టిజిఈజేఏసి నిరంతరం కృషి చేస్తోందన్నారు. టిజిఈజేఏసి కార్యక్రమాల్లో ఖమ్మం జిల్లా ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని పేర్కొన్నారు. ఉద్యోగుల హెల్త్ స్కీమ్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ఉద్యోగుల్లో ఉన్న అపోహలను తొలగించి సమర్థవంతమైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. పిఆర్ సి ను అతి త్వరలో విడుదల చేసి, 5 శాతం ఫిట్‌మెంట్‌తో 15 శాతం ఫిట్‌మెంట్ ప్రయోజనం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న డిఏ లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.పెండింగ్ బిల్లుల చెల్లింపులు కొన్ని దశలవారీగా జరుగుతున్నాయని, గ్రీన్ ఛానల్ ద్వారా వచ్చే బిల్లులు కూడా పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. మిగిలిన పెండింగ్ బిల్లులను కూడా త్వరితగతిన చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఎస్ రద్దు కి టిజిఈజేఏసి కృషి చేస్తుంది అని అన్నారు. ఉద్యోగుల సమస్యలు ఏ ఒక్క సంఘానికో, ఏ ఒక్క శాఖకో పరిమితం కావని, రాష్ట్రంలోని మొత్తం ఉద్యోగ వర్గాలకు సంబంధించినవని ఆయన అన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు, సేవా సంబంధిత సమస్యలు, ఆర్థిక ప్రయోజనాలు, పెన్షనర్ల సమస్యలు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం టిజిఈజేఏసి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఆగస్టు 27న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిర్వహించనున్న మహాధర్నా కార్యక్రమానికి ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడు, గెజిటెడ్ అధికారి, వర్కర్, పెన్షనర్, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఐక్యత, క్రమశిక్షణ, శాంతియుత పోరాటమే ఉద్యోగుల హక్కుల సాధనకు ప్రధాన మార్గమని స్పష్టం చేశారు.అనంతరం టిజిఈజేఏసి ఖమ్మం జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని అన్ని ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు, ఫెడరేషన్లు, ఉపాధ్యాయ సంఘాలు, పెన్షనర్ సంఘాలు, కాంట్రాక్టు మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగ సంఘాలు సమన్వయంతో పనిచేసి ఆగస్టు 27 మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సేవా ప్రయోజనాలు, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఖమ్మం జిల్లా ఉద్యోగ వర్గాలు ఎల్లప్పుడూ ఐక్యతకు, సంఘటిత పోరాటానికి ప్రాధాన్యత ఇస్తున్నాయని, అదే స్ఫూర్తితో ఆగస్టు 27న ఖమ్మం కలెక్టరేట్ ఎదుట జరిగే మహాధర్నాలో ప్రతి శాఖ నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, వర్కర్లు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జిల్లా ఉద్యోగుల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.ఆగస్టు 27 మహాధర్నా కేవలం ఒక కార్యక్రమం కాదని, ఉద్యోగుల ఐక్యత, సంఘటిత శక్తి మరియు న్యాయమైన హక్కుల సాధన కోసం వారి సంకల్పాన్ని చాటే ముఖ్యమైన ఉద్యమ కార్యక్రమమని గుంటుపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు.––– నాయకుల సంయుక్త పిలుపుసమావేశంలో పాల్గొన్న వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అందరూ ఒకే తాటిపైకి వచ్చి టిజిఈజేఏసి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు."ఐక్యతే మన బలం – సంఘటిత పోరాటమే మన ఆయుధం – న్యాయమైన హక్కుల సాధనే మన లక్ష్యం" అనే నినాదంతో ఆగస్టు 27న ఖమ్మం కలెక్టరేట్ ఎదుట జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు.పెద్ద సంఖ్యలో ఉద్యోగులు తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేయడం ద్వారా టిజిఈజేఏసి పట్ల తమ సంపూర్ణ ఐక్యతను, మద్దతును చాటాలని నాయకులు పిలుపునిచ్చారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

సోమవారం | హైదరాబాద్
24 - 08 - 2026
www.netisubhodaya.com
నేటి శుభోదయ



## బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ ప్రజా ప్రతినిధులు మరియు అధికారుల పక్షాన..

- బీసీ పీపుల్స్ ఫెడరేషన్..
- వ్యవస్థాపక అధ్యక్షులు బొంగు వెంకటేష్ గౌడ్



**ఎల్బీనగర్; ఆగస్టు 23, నేటి శుభోదయ :** ఈ రాష్ట్రంలోబీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ ప్రజాప్రతినిధుల పైన గాని అధికారుల పైన గాని కులం పేరుతో గాని.కుల వృత్తులను అవహేళన చేసి మాట్లాడిన బీసీ పీపుల్స్ ఫెడరేషన్ ఊరుకోదు.వారి పక్షాన బీసీ పీపుల్స్ ఫెడరేషన్ నిలబడుతుంది.ఎల్బీనగర్ నియోజకవర్గంలో గత కొంతకాలంగా బీసీ ఎస్సీ, ఎస్టీ కులాలను కించపరుస్తూ కులాన్ని అవమానపరుస్తూ కులవృత్తులను దెబ్బతీస్తూ అవహేళ మాట్లాడిన వ్యక్తి జెక్కిడి ప్రభాకర్ రెడ్డి వారి కుమారుడు జెక్కిడి శివ చరణ్ రెడ్డి.గత రెండు రోజుల క్రితం ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ మధు యాష్కి గౌడ్ మాజీ పార్లమెంట్ సభ్యులు తెలంగాణ ఉద్యమకారులు అయినటు వంటి సీనియర్ నాయకుల మీద జెక్కిడి ప్రభాకర్ రెడ్డి,మధు యాష్కి గౌడ్ ని వ్యక్తిగతంగా టార్గెట్ చేసి మాట్లాడుతున్నటు వంటి జెక్కిడి ప్రభాకర్ రెడ్డి కొంచెం జాగ్రత్తగా మాట్లాడండి.మధు యాష్కి గౌడ్ గారిని రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగతంగా మాట్లాడితే మధు యాష్కి గౌడ్ గారి పక్షాన బిసి పీపుల్స్ ఫెడరేషన్ ఉంటుందని విషయాన్ని గుర్తు చేస్తా ఉన్నాను.

## పాఠశాల స్థాయి నుండే విద్యార్థుల్లో పెరిగిపోతున్న పైశాచిక తత్వం

**ఖమ్మం, ఆగస్టు 23, నేటి శుభోదయ :** అతిగారాభం విచ్చలవిడిగా డబ్బులు ఇవ్వడం తో పాటు తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపంతో పిల్లలలో విచ్చలవిడితనం పెరిగిపోతుంది. పాఠశాల స్థాయి నుండి గంజాయితో పాటు మద్యానికి అలవాటు పడిపోవటం ద్వారా డబ్బుల కోసం బరితెగించి హత్యలకు పాల్పడుతున్న సంఘటనలు కోకొల్లలు. ఇటీవల నల్లగొండ జిల్లాలోని ఒక ప్రిన్సిపాల్ హత్య చేసిన సంఘటన రాష్ట్ర మొత్తం కలకలం రేపింది. చెడు అలవాట్లకు బానిసలై తిరుగుతుంటే మందలించిన పాపానికి ఒంటరిగా ఉన్న సమయాన్ని అదునుగా తీసుకొని కిరాతకంగా హత్య చేయడమే కాక పెద్ద మొత్తంలో నగదును తస్కరించి విచ్చలవిడిగా ఖర్చు చేసిన ఉదాంతం. స్మార్ట్ ఫోన్ కొనియలేదని గుట్ట పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటున్నామని బెదిరించి తండ్రి గుట్ట పైకి ఎక్కి కుమారునివారించగా ఇద్దరు ప్రమాదవశాత్తు మరణించిన సంఘటనలు ఉన్నాయి. తల్లిదండ్రులు సెల్ ఫోన్ కొనియలేదని ఒక విద్యార్థి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గతంలో జరిగింది. తల్లిదండ్రులు డబ్బులు పంపించిన అవి సద్వినియోగపరచుకోక, దురలవాట్లకు బానిసై యువత చైన్ స్నాచింగ్కి పాల్పడుతున్న సంఘటనలు ఉన్నాయి. విశేషమేమిటంటే ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులు ఇటువంటి చర్యలు పాల్పడటం గమనార్హం. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఒక ఉపాధ్యాయురాలు పిచ్చి పిచ్చి స్టైల్స్ తో జుట్టును పెంచుకుంటాం దాన్ని ఉపాధ్యాయురాలు కటింగ్ చేయడం వల్ల సస్పెండ్ అయిన సంఘటన మన జిల్లాలో జరిగింది. మంచికి పోతే చెడు ఎదురైనట్లు ఉంది. సమయపాలన పాటించకుండా కాలేజీకి ముందుగానే వచ్చిన రోడ్లపైనే ప్రచారం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. క్లాసులకు రాకుండా బయట పచారాలు చేస్తున్నారు. ఎక్కడైనా కాలేజీ ఫంక్షన్లో తాగి గందరగోళం చేస్తున్నారు. రాత్రిపూట యువత గంజాయి సేవించి కొన్నిచోట్ల ప్రయత్నాలకు గురి చేస్తున్నారు రోడ్ల మీద వెళ్లే దంపతులు వద్ద నుండి నగలను దోచుకుంటున్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం షాపులు ఉండటం వల్ల షాపింగ్ చేసేవారికి ఇబ్బందులు జరుగుతున్నాయి. కొన్ని హాస్టల్లో సైతం ధూమపానం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారు. ఆ మత్తులో తోటి విద్యార్థులను విచక్షణారహితంగా కొడుతున్న సంఘటనలు ఉన్నాయి. రేవ్ పార్టీలు వీకెండ్ పార్టీలు లలో మద్యం మత్తు పదార్థాలు విచ్చలవిడిగా వినియోగం అవుతున్నాయి. పార్టీల మాటున అసాంఘిక కార్యక్రమాలు సైతం జరుగుతున్నాయి. కళాశాలలో పాఠశాలల్లో ఉపాధ్యాయులు లెక్చరర్లు మందలించిన పెడచెవులు పెడుతున్నారు. మంచికి పోతే వారిపైనే ఫిర్యాదులు చేస్తున్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుపోవటం వలన మరింత రెచ్చిపోతున్నారు. స్మార్ట్ ఫోన్స్ కంప్యూటర్ సిస్టం లో చాటింగులు చేస్తూ గంటల కొద్ది గడుపుతూ విద్యను నిర్లక్ష్యం చేస్తున్నారు. కొందరు టీనేజ్ ప్రేమ పేరుతో తప్ప అడుగులు వేస్తున్నారు. దీనికి ప్రత్యక్షంగా పరోక్షంగా తల్లిదండ్రుల ప్రధాన కారణం. ఎవరితోనో పోటీపడి తమ స్థాయిని మరిచి తల్లిదండ్రుల పైన ఒత్తిడి తెచ్చి విచ్చలవిడిగా డబ్బులు అడుగుతున్నారు. ఇది పరోక్ష కారణంగా చెప్పవచ్చు. కఠినమైన శిక్షలు అమలు చేస్తే తప్ప నివారించలేం. రాత్రి వేళల్లో గస్తీని పోలీసులు ముమ్మరం చేయాలి. కొన్ని ప్రధాన కూడల లో కళాశాల వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తే కొంతమేర లాభం జరుగుతుంది.

## కిరాణా దుకాణాల్లో సీసీ కెమెరాలను పరిశీలించిన ఎస్సై నారబోయిన సంధ్య



**ఏన్కూర్, ఆగస్టు 23, నేటి శుభోదయ :** ఏన్కూరు మండల కేంద్రంలోని పలు కిరాణా దుకాణాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఏన్కూరు ఎస్సై నారబోయిన సంధ్య ఆదివారం పరిశీలించారు. దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, రికార్డింగ్ పరిస్థితిని స్వయంగా తనిఖీ చేశారు. నేరాల నియంత్రణతో పాటు ఏదైనా ఘటన జరిగిన సమయంలో నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు కీలకంగా ఉపయోగపడతాయని ఎస్సై తెలిపారు.వ్యాపారులు తమ దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను నిరంతరం పనిచేసేలా చూసుకోవాలని సూచించారు. దుకాణం ముందు భాగంతో పాటు పరిసర ప్రాంతాలు స్పష్టంగా కనిపించేలా కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, రికార్డింగ్ సక్రమంగా జరుగుతుందో లేదో ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై సంధ్య సూచించారు.

## భక్తిశ్రద్ధలతో చౌడమ్మ బోనాలు.. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని : ప్రేమ్ కుమార్ గౌడ్



**కేశంపేట, ఆగస్టు 23, నేటి శుభోదయ :** కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం యాదవ సోదరులు ప్రత్యేకంగా నిర్వహించిన చౌడమ్మ బోనాల పండుగను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని చౌడమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో యువనాయకుడు ప్రేమ్ కుమార్ గౌడ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌడమ్మ అమ్మవారి ఆశీస్సులు కొండారెడ్డిపల్లి గ్రామ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, గ్రామం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అభివృద్ధితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.బోనాల పండుగ సందర్భంగా గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది. యాదవ సోదరులు సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ నరేష్, వార్డు సభ్యులు మాధవ్, శిరీష, లింగం యాదవ్, సంగీత సత్యం, యువకులు కోనేరు శ్రీనివాస్, యాదవ సోదరులు కళ్లేపల్లి చెన్నయ్య, భీమయ్య, పోషమోని మల్లేష్, ఈటమోని మల్లేష్, లింగం, కర్ణాకర్, వట్టెల శ్రీశైలం, మంద కుమార్, శశాంక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు. వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా కొనసాగాయి.

## ఎస్ఐఆర్ ఫేజ్ - 2పై బీఎల్ఏలకు అవగాహన



**మంథని, ఆగస్టు 23, నేటి శుభోదయ :** పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలోని పాలకుర్తి, కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం, మంథని మండలాలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లకు (బి ఎల్ ఏ) ఎస్ఐఆర్ (ఎస్ ఐ ఆర్) ఫేజ్–2 ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంథని మంత్రి శ్రీధర్‌బాబు క్యాంపు కార్యాలయంలో టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు స్క్రీన్ ద్వారా సమగ్రంగా వివరించారు.ఫేజ్–2లో చేపట్టాల్సిన ప్రక్రియ, బూత్ స్థాయిలో బీఎల్ఏల బాధ్యతలు, ఓటర్ల వివరాల పరిశీలన, ఓటరు జాబితాలో తప్పులు, మార్పులు, సవరణలను గుర్తించే విధానాన్ని ప్రదర్శన ద్వారా వివరించారు. ఓటరు జాబితా సక్రమంగా ఉండేలా బీఎల్ఏలు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఉంటుందని రైతులు అభిప్రాయపడ్డారు.

## ఇంటింటికీ 'ఇందిరమ్మ' కుట్టుమిషన్లు -బీసీ మహిళలకు ఉపాధి



**మంథని,ఆగస్టు 23, నేటి శుభోదయ :** నితెల ంగాణ ప్రభుత్వం మహిళల సాధికారత, ఆర్థికాభివృద్ధికి ఇందిరా మహిళా శక్తి ద్వారా అనేక సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలను కలిపిస్తోందని గంగాపురి నాలుగవ వార్డు కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్ బాబు తెలిపారు. ఇందులో భాగంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశంతో 'ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టుమిషన్' పథకాన్ని అమలు చేయనుంది.ఈ పథకం ద్వారా అర్హులైన బీసీ మహిళలకు రూ.12 వేల విలువైన ఆటోమేటిక్ కుట్టుమిషన్లను 100 శాతం సబ్సిడీపై ఉచితంగా అందించనున్నారు. అర్హత కలిగిన మహిళలు ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.గంగాపురి గ్రామంలోని అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాము.

## విశ్వ హిందూ పరిషత్ పెద్దపల్లి జిల్లా కార్యవర్గ సమావేశం



**మంథని, ఆగస్టు 23, నేటి శుభోదయ :** ప్రమంత్రపురి విశ్వ హిందూ పరిషత్ పెద్దపల్లి జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం మంథని లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ కళ్యాణమండపంలో నిర్వహించారు. ఈ సమావేశానికి కరీంనగర్ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్ అధ్యక్షత వహించారు.ఈసమావేశంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, సంస్థాగత బలోపేతం, హిందూ ధర్మ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలపై కార్యవర్గ సభ్యులతో చర్చించారు.జిల్లాలోని అన్ని మండలాలు, ప్రఖండాలు మరియు గ్రామ స్థాయిలో సంస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజల్లో ధార్మిక, సామాజిక చైతన్యం పెంపొందించే విధంగా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో పెద్దపల్లి జిల్లా కార్యదర్శి నాగుల మల్యాల సత్యం, సహ కార్యదర్శి అడిగొప్పుల రాజు జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త శ్రీనివాస్ గుప్తా, మంథని ప్రకండ అధ్యక్షులు రావుల సతీష్ ,ఉపాధ్యక్షులు బోట్ల ఆంజనేయులు మాదాడి నరేందర్ రెడ్డి, సత్సంగ్ ప్రముఖ్ కొమురవెల్లి హరిష్ గుప్తా,సహా కార్యదర్శిలు గుండా శ్రీనివాస్,కజ్జం శ్యామ్,మందిర్మత్ ప్రముక రాజమౌళి గౌడ్, గోరక్ష ప్రముఖ్ నూక శ్రీనివాస్,ప్రచార ప్రముక తూర్పటి రాము,సభ్యులు గాజుల సురేష్,మండల శివ,బండారి ప్రసాద్,కొమురవెల్లి తిరుపతి, సిల్వేరి రవీందర్,నిమ్మతి శ్రీనివాస్,వడ్లకొండ శ్రావణ్, మాచిడి శ్రీధర్ మరియు మాతృశక్తి మంథని సంయోజక రావి కంటి రేణుకా, సహసంయోజక కొత్త పుష్పలత,తోట సునీత,రాచర్ల తిరుమల కుక్కడపు రాధా, దుర్గావాహిని జిల్లా సంయోజక తిరుమల, భజరంగదల్ అన్ని ప్రకండ కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా వివాహ మహోత్సవం



**రాజేంద్రనగర్, ఆగస్టు 23, నేటి శుభోదయ :** బండ్లగూడ తులిప్ ఆర్కేడ్ ప్రాంతానికి చెందిన పిట్ల విజయలక్ష్మి , రవీందర్ ముదిరాజ్ జ్యేష్ఠ కుమారుడు దిలీప్ వివాహం బెక్కం జయ దేవి, కీర్తిశేషులు విట్టల్ రాజ్ ద్వితీయ పుత్రిక గీతికతో ఆదివారం వేద పండితుల మంత్రోత్సవాల మధ్య ఘనంగా జరిగింది. కర్మన్ ఘాట్ లోని ఎస్ వై ఆర్ సమావేశ మందిరంలో ఈ వివాహ మహోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి బంధుమిత్రులతో పాటు శ్రేయోభిలాషులు వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

## నేడు మంత్రి శ్రీధర్ బాబు పర్యటన



**మంథని, ఆగస్టు-23, నేటి శుభోదయ :** రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం మంథని, కమాన్‌పూర్ మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనను న్నారు. ఉదయం 9 గంటలకు మంథని గంగపురిలో హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ప్రారంభించనున్నారు. పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 22 వేల మంది విద్యార్థులకు ఉదయం టిఫిన్ అందించే కార్యక్రమాన్ని ఈ కిచెన్ ద్వారా ప్రారంభిస్తారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు గంగపురి వద్ద రూ.2.55 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నారు.ఉదయం 11.30 గంటలకు కమాన్‌పూర్ మండలంలో రూ.75 లక్షలతో నిర్మించిన తహసీల్దార్ (ఎంఆర్ఓ) కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం ఆదివరాహ స్వామి ఆలయానికి రూ.95 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, కమాన్‌పూర్ గ్రామంలో రూ.30 లక్షలతో చేపట్టిన ఈజీఎస్ పనులను ప్రారంభించనున్నారు.అలాగే గుండారం గ్రామం రాజాపూర్ నుంచి మంగపేట వరకు రూ.3.05 కోట్లతో నిర్మించనున్న బ్రిడ్జికి శంకుస్థాపన చేసి, అనంతరం ఆదివరాహ స్వామి జయంతి కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొననున్నారు.

## ధమ్మన్‌పేట్‌లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి
### - 7 మంది అరెస్ట్




**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి ,ఆగస్టు 23, నేటి శుభోదయ :** ధర్పల్లి ధమ్మన్‌పేట్ గ్రామంలోని ఓ పౌల్ట్రీ ఫామ్‌లో పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో ఎస్ఐ సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.30,010 నగదు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

## సభ్యుల ఆర్థిక చేయూతకు నిబంధనల మేరకు మరింత కృషి

**రాజేంద్రనగర్, ఆగస్టు 23,నేటి శుభోదయ :** సభ్యులకు మరింత ఆర్థిక చేయూతనందించడానికి నిబంధనల మేరకు కృషి చేయనున్నట్లు సత్యసాయి పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం లిమిటెడ్ అధ్యక్షుడు పగిడిమర్రి సూర్యనారాయణ తెలిపారు. మొండి బకాయిదారు నుంచి రుణాల వసూళ్లకు న్యాయ సహదారుడి నియామకాన్ని చేపట్టాలని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం శుభ పరిణామంగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆదివారం మార్కండేయనగర్ కాలనీలోని సత్యసాయి పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం లిమిటెడ్ 26వ వార్షిక సర్వసభ్య సమావేశం సంఘ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సభలో వార్షిక నివేదిక ప్రవేశపెట్టి, ఆ కాపీలను సభ్యులకు అందజేశారు. అనంతరం వార్షిక నివేదిక చదివి వినిపించి, సభ్యుల నుంచి వచ్చిన అభ్యంతరాలు, అనుమానాలను నివృత్తం చేశారు. దాంతో మహా సభలో సభ్యులు గడిచిన ఆర్థిక సంవత్సరం సంఘం నిర్వహణ లావాదేవీలు, ఆదాయ, వ్యయాల తనిఖీ నివేదికలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం అధ్యక్షుడు పగిడిమర్రి సూర్యనారాయణ మాట్లాడుతూ 20 మంది సభ్యులతో ప్రారంభమైన సత్యసాయి పొదుపు సంఘం ప్రస్తుతం 670 మంది పొదుపు సభ్యులకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 1వ తేదీ 2025 నాటికి రూ. 5 కోట్ల 13 లక్షల 92 వేల 260 రూపాయల ప్రారంభ నిల్వ లావాదేవీలతో ప్రారంభమైన సంఘ నిర్వహణ ఈ ఏడాది మరో రూ. 55. 86 లక్షల ఆర్థిక వృద్ధి సాధించి రూ. 5 కోట్ల 69 లక్షల, 78 వేల 772 రూపాయల టర్నోవర్ ను 31 మార్చి 2026 నాటికి సాధించినట్లు పేర్కొన్నారు. అంతకు ముందు వ్యవస్థాపక సలహాదారుడు గద్దె యాదగిరి సభ దృష్టికి తీసుకువచ్చిన రూ. 5 లక్షల సరళీకృత చెల్లింపుల పథకం, రుణ మంజూరీ రూ. 5 లక్షల గరిష్ట పరిమితి ప్రతిపాదనల పై సభలో సుదీర్ఘంగా చర్చ కొనసాగింది. అనంతరం గరిష్ట రుణ పరిమితి రూ. 5 లక్షలకు పరిమితం చేయడంతో పాటు సరళీకృత చెల్లింపుల పథకం ప్రస్తుతం ఉన్న లక్ష రూపాయల పరిమితిని రూ. 2 లక్షలకు పెంచుతూ ప్రవేశపెట్టిన ప్రతిపాదనను సభ్యులు ఆమోదించారు. మొండి బకాయిదారులు సంఘానికి చెల్లించాల్సిన రుణాల మొత్తం జాబితా వార్షిక నివేదికలో ఆ పూర్తి వివరాలతో సభ్యులకు తెలిసేలా ముద్రించాలన్న ప్రతిపాదనను సభ్యులు ఆమోదించారు. అలాగే



ముఖ్య సలహాదారులు ఏర్వ సత్యనారాయణ, గద్దె క్రిష్ట పదవీ విరమణ చేసే సభ్యులకు వారు రుణం పొందినప్పుడు చెల్లించిన సరళీకృత చెల్లింపుల పథకం మొత్తాన్ని ఎలాంటి క్లెయిమ్ లేని సభ్యులకు తిరిగి చెల్లించాలనే ప్రతిపాదనను కూడా సభ్యులు ఆమోదిస్తూ పదవీ విరమణ పొందే సభ్యులకు సంఘం గ్రాంట్ గా రూ. 1116 అందజేయాలని తీర్మానించారు. అలాగే గతంలో తీర్మానించిన మేర చేపట్టనున్న సత్యసాయి కళ్యాణ మండపం నిర్మాణ వ్యయం ఎంత, ఆ పనులకు కొటేషన్లు పిలిచారా, అన్న సభ్యుడు యాదగిరి భాస్కర్ ప్రశ్నను స్వాగతించిన పాలక వర్గం దేవాలయం వద్ద రిటర్నింగ్ వాల్ నిర్మాణం కోసం చేస్తున్న ప్రయత్నాలు ప్రణాళిక రూపం దాల్చాయని, టెండర్ అనంతరం ఆ పనులు పూర్తి అయిన తరువాత నిర్మాణ పనులు ప్రారంభించే ముందు అయ్యే ఖర్చుల పై పాలక వర్గం చర్చించి, కళ్యాణ మండప నిర్మాణ కాంట్రాక్టర్ ఎంపిక ప్రక్రియ చేయనున్నట్లు పాలకవర్గం వెల్లడించింది. వేదవ్యాస్ అండ్ అసోసియేట్స్, చార్టర్డ్ అకౌంటెంట్స్ నివేదికను తనిఖీదారుడు వెంకటేష్ సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మునగపాటి విష్ణు, ప్రధాన కార్యదర్శి కోట శ్యామ్ కుమార్, సంయుక్త కార్యదర్శి శిరందాసు నరేందర్, కోశాధికారి కోట పవన్ కుమార్, పాలకవర్గ సభ్యులు కైరంకొండ, కర్నాటి శ్రీనివాస్, గంజి ధనంజయ్, బాత్కు విజయ్ కుమార్, బోనకుర్తి రాము, పూల పద్మమ్మ, గంజి నాగమణి, సంఘం గణకుడు రాజు తోపాటు పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

## అసమ్మతి కుంపటిలో కాంగ్రెస్, కుదేలవుతున్న బీఆర్ఎస్

- **బీజేపీకి బంగారు పళ్ళెంలో అధికారం అప్పగిస్తున్నారా...?**
- **తెలంగాణ రాజకీయ సంక్షోభంపై సమగ్ర రాజకీయ విశ్లేషణ**

**ఖమ్మం, ఆగస్టు 23, నేటి శుభోదయ :** తెలంగాణ రాజకీయ ముఖచిత్రం రోజురోజుకూ వేడెక్కుతోంది. ఒకవైపు అధికార కాంగ్రెస్‌లో అంతర్గత వర్గపోరు పతాక స్థాయికి చేరి మంత్రివర్గ బర్తరఫ్‌ల వరకు వెళ్లడం, మరోవైపు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌లో కుటుంబ, అంతర్గత కుమ్ములాటలు ముదరడంతో క్షేత్రస్థాయి రాజకీయం సంక్షోభంలో పడింది. ఈ రెండు ప్రధాన పార్టీల వైఫల్యాలు, స్వార్థ రాజకీయాలు అంతిమంగా భారతీయ జనతా పార్టీకి (బీజేపీ) తెలంగాణలో విస్తరించేందుకు బంగారు పళ్ళెంలో అధికారాన్ని పెట్టి ఇచ్చేలా మారాయనే చర్చ క్షేత్రస్థాయిలో తీవ్రంగా సాగుతోంది.

--- పరకాల కేంద్రంగా రాజుకున్న రచ్చ : కొండా వర్సెస్ రేవంత్ రెడ్డి పోరు పరకాల నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన బహిరంగ సభలో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే రాబోయే ఎన్నికల్లో పూర్తి మద్దతు ఉంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బహిరంగంగా సంకేతాలు ఇవ్వడంతో వివాదం మొదలైంది. ఆ స్థానంపై దీర్ఘకాలిక ఆశలు పెట్టుకున్న మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత సీఎం నిర్ణయాన్ని తీవ్రంగా సవాలు చేశారు. టికెట్ నిర్ణయించే అధికారం ఏఐసీసీ పరిధిలోనిదని, సీఎం ఏకపక్షంగా ప్రకటిస్తే సహించేది లేదని, అవసరమైతే స్వతంత్ర అభ్యర్థిగానైనా బరిలోకి దిగుతానని స్పష్టం చేశారు.గీసుకొండ సభలో సుస్మిత మాట్లాడుతూ "నా టికెట్ నిర్ణయించడానికి రేవంత్ ఎవరు?" అని నిలదీశారు. కాంగ్రెస్ క్రమంగా 'టీడీపీ కాంగ్రెస్'గా మారుతోందని, రాష్ట్రంలో బీసీ నేతలను తొక్కిపెడుతున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. అంతేకాకుండా, సీఎం సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన 'టెస్సరాక్ట్' సంస్థకు దాదాపు రూ 200 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అప్పగించారంటూ ప్రతిపక్షాల ఆరోపణలను ప్రస్తావించారు. గాంధీ కుటుంబంపై తనకు గౌరవం ఉందని, తన పోరాటం రేవంత్ రెడ్డి ఒంటెద్దు పోకడలపైనేనని ఆమె వెల్లడించారు.మంత్రి కొండా సురేఖ అధికారాలకు కత్తెర వేశారంటూ కొండా వర్గం ఆవేదన వ్యక్తం చేస్తోంది. గతంలో మాజీ ఓఎస్డీ సుమంత్‌పై నమోదైన కేసు దర్యాప్తు సందర్భంగా పోలీసులు సురేఖ నివాసానికి వెళ్లినప్పుడు సుస్మిత తీవ్రస్థాయిలో నిరసన తెలపడం, అలాగే మేడారం జాతర సందర్భంగా సుమారు రూ 71 కోట్ల నిధుల పనుల టెండర్లలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జోక్యం చేసుకున్నారని ఆరోపించడం వంటి పాత వివాదాలు సైతం మళ్లీ తెరపైకి వచ్చాయి.క్రమశిక్షణ కమిటీ నోటీసులు, సురేఖ వివరణ, సీఎల్పీ తిరుగుబాటుసుస్మిత పార్టీ ప్రాథమిక సభ్యురాలు కాకపోవడంతో, తల్లిగా ఉన్న మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనికి సురేఖ లేఖ ద్వారా బదులిస్తూ సుస్మిత మేజర్ అని, ఆమె చేసినవి వ్యక్తిగత వ్యాఖ్యలని, కుటుంబ బంధం ఆధారంగా తనపై చర్యలు కోరడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని స్పష్టం చేస్తూ నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు. అనంతరం రాసిన రెండో లేఖలో తనపై దాడి చేయిస్తున్న 'అదృశ్య శక్తులను' గుర్తించాలని డిమాండ్ చేశారు.మరోవైపు, ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల ఐలయ్య నేతృత్వంలో విప్‌లు వేముల వీరేశం, నాయిని రాజేందర్ రెడ్డి, రామచందర్ నాయక్, ఎమ్మెల్యేలు బాలు నాయక్, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, వీర్లపల్లి శంకర్, ఎడ్మ బొజ్జు, నవీన్ యాదవ్ తదితర 20 మందికి పైగా శాసనసభ్యులు సీఎల్పీ కార్యాలయంలో భేటీ అయ్యారు. సీఎంపై ఆరోపణలను మంత్రి బహిరంగంగా ఖండించకపోవడాన్ని తప్పుపడుతూ, సురేఖను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయడంతో పాటు పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఏఐసీసీకి తీర్మానం పంపారు. దీంతో కాంగ్రెస్ రెండు వర్గాలుగా చీలిపోయినట్లయింది.

### చీలిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సీనియర్ల నిశ్శబ్ద వైఖరి
### సీఎం రేవంత్ రెడ్డి వర్గం బర్తరఫ్ డిమాండ్

ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల ఐలయ్య, విప్ రాంచందర్ నాయక్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, నాయిని రాజేందర్ రెడ్డి, అదిలూరి లక్ష్మణ్ కుమార్, రేవూరి ప్రకాశ్ రెడ్డి, బాలు నాయక్, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, వీర్లపల్లి శంకర్, ఎడ్మ బొజ్జు, నవీన్ యాదవ్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వేం నరేందర్ రెడ్డి వర్గం మంత్రి బర్తరఫ్ కోసం గట్టిగా పట్టుబడుతున్నాయి.

### ఒరిజినల్ కాంగ్రెస్ వర్గం నిశ్శబ్ద మద్దతు

సీనియర్ నేతలు డాక్టర్ జి. చిన్నారెడ్డి, టి. జీవన్ రెడ్డి, నేతలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, జగ్గారెడ్డి, అజారుద్దీన్, మధుయాష్కీ గౌడ్, కీలక మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వేచిచూసే ధోరణిలో ఉంటూ వలస నేతల పెత్తనాన్ని వ్యతిరేకిస్తున్నారు. మంత్రి సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలకు బీసీ మహిళా మంత్రిని టార్గెట్ చేయడం సరికాదని భావిస్తూ అంతర్గతంగా మద్దతుగా నిలుస్తున్నారు. క్రమ శిక్షణా చర్యల్లో వివక్ష చూపుతున్నారనే అసంతృప్తి పార్టీలోని బీసీ వర్గాల్లో రగులుతోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి ఓసీ నేతలు పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడినప్పుడు వారికి గానీ, మంత్రి వెంకట్ రెడ్డికి గానీ నోటీసులు ఇవ్వలేదని, కేవలం బీసీ (పద్మశాలి) మహిళా మంత్రి కుటుంబాన్నే ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారని ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. గోపాల్‌పేట వ్యవహారంలో నోటీసు అందుకున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి లేఖ రాస్తూ 1978 నుంచి పార్టీ జెండా మోస్తున్నానని, స్థానిక ఎమ్మెల్యే ఒంటెద్దు పోకడల వల్ల 40 ఏళ్లుగా పనిచేస్తున్న ఒరిజినల్ కాంగ్రెస్ కార్యకర్తలు పడుతున్న బాధలను మాత్రమే ప్రస్తావించానని వివరిస్తూ నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు.

### పీసీసీ వైఫల్యం, వలస నేతల ఆధిపత్యం

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బీసీ నేత అయినప్పటికీ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని, డీసీసీ అధ్యక్షులు, మండల అధ్యక్షుల్లో పార్టీ పారదర్శకత విస్మరించి కేవలం ఎమ్మెల్యేల మాటతో మండల, జిల్లా అధ్యక్షుల నియామకం చేసారని విమర్శలు ఉన్నాయి. పార్టీ పదవుల్లో పాత వారికి 80 శాతం, కొత్త వారికి 20 శాతం కేటాయిస్తామన్న హామీ అటకెక్కింది. నియోజకవర్గాల్లో ఆరేడు మండలాలు ఉన్నప్పటికీ బీసీ, ఎస్సీ వర్గాలకు ప్రాధాన్యత దక్కడం లేదని, ఎమ్మెల్యేలకు 'డూడూ బసవన్నలుగా' ఉండే వారికే పదవులు ఇస్తున్నారని కేడర్ మండిపడుతోంది. ఎంపీలు సైతం నియోజకవర్గాల్లో తిరగడానికి ఎమ్మెల్యేల అనుమతి తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎన్టీఆర్ కాలం నుంచి చంద్రబాబు, కేసీఆర్ మీదుగా పార్టీలు మారి వచ్చిన వలస నాయకులు ఇప్పుడు కాంగ్రెస్‌లో కీలక స్థానాలు ఆక్రమించి పాత కేడర్‌ను అణచివేస్తున్నారని అసమ్మతి వర్గం ఆరోపిస్తోంది. 'ఫ్యూచర్ సిటీ' వంటి హైటెక్ ప్రాజెక్టులకు, అధికార వర్గానికి సన్నిహితమైన మంత్రుల నియోజకవర్గాలకే ప్రాధాన్యతనిస్తూ గ్రామీణ ప్రాంతాలకు నిధులు విడుదల చేయడం లేదని, గ్రామాల్లో కేవలం కేంద్ర నిధులే దిక్కయ్యాయని విమర్శలు వస్తున్నాయి. కొందరు ఎమ్మెల్యేల ఇసుక, మట్టి, బెల్లం దందాలు పెరిగిపోయాయని, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల వంటి గ్యారెంటీల అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని గ్రామీణ ప్రజలు అసంతృప్తితో ఉన్నారు.

### బీఆర్ఎస్‌లో ముసలం, కవిత వర్సెస్ కేటీఆర్ కుటుంబ పోరు

అటు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సైతం తీవ్ర అంతర్గత సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. జైలు నుంచి విడుదలైన తర్వాత ఎమ్మెల్సీ కవిత సొంతంగా వ్యవహరిస్తూ, పార్టీలో తనదైన పట్టు కోసం ప్రయత్నిస్తుండటం కేసీఆర్, కేటీఆర్ వర్గాలకు తలనొప్పిగా మారింది. పార్టీ సిద్ధాంతాలు, ప్రజా ఉద్యమాల కంటే కుటుంబ ఆధిపత్య పోరు, అంతర్గత విభేదాలే ప్రధానమై కేడర్ అయోమయంలో పడింది. పదేళ్ల పాలనలో ఎదురైన ఆరోపణలను సమర్థించుకోవడానికే పరిమితమవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ రెండు ప్రధాన పార్టీల వైఫల్యాలే బీజేపీకి బలంగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు, బీసీల విస్మరణ, 'ఎల్లో కాంగ్రెస్' పెత్తనం, అటు బీఆర్ఎస్‌లో కుటుంబ కలహాలు వెరసి రాష్ట్రంలో రాజకీయ శూన్యత ఏర్పడింది. ఈ రెండు చిన్న చెరువుల గట్లు తెగితే, ప్రజా మద్దతు నేరుగా పెద్ద చెరువైన బీజేపీ వైపు మళ్లే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.గతంలో రెండు ఎంపీ సీట్లతో (హనుమకొండ నుంచి చందుపట్ల జంగారెడ్డి, ఉత్తర ప్రదేశ్ నుండి అటల్ బిహారీ వాజ్‌పేయి) ప్రస్థానం ప్రారంభించిన బీజేపీ, నేడు దేశంలో బడుగు బలహీన వర్గాలను ఆకర్షిస్తూ, సాధారణ కార్యకర్తలను ఎమ్మెల్యేలు, మంత్రులుగా ప్రమోట్ చేస్తూ ప్రజల్లోకి చొచ్చుకుపోతోంది. ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ప్రజా సమస్యలు, సిద్ధాంతాలు పక్కనబెట్టి వ్యక్తిగత కక్షలు, కుర్చీ కొట్లాటల్లో మునిగిపోయి, అంతిమంగా రాష్ట్రాన్ని బీజేపీ చేతుల్లో పెట్టేలా పరిస్థితులను వారే సృష్టిస్తున్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, జీహెచ్ఎంసీ, మున్సిపల్ కార్పొరేషన్లు, ఖాళీ అవుతున్న శాసనమండలి స్థానాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌ల ఈ స్వయంకృత వైఖరి బీజేపీకి పూర్తి స్థాయి ప్రయోజనం చేకూర్చేలా ఉంది. ఈ కుమ్ములాటలు ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాలు పూర్తిగా బీజేపీ వర్సెస్ బి.ఆర్.ఎస్, కాంగ్రెస్ మారి తీవ్ర మూల్యం చెల్లించుకోక తప్పదనే విశ్లేషణలు వెలువడుతున్నాయి.

# వృత్తి ప్రభుత్వ ఉపాధ్యాయుడు.. ప్రవృత్తి సేవ గుణం..

- తెలివితేటలు కలిగిన ఆర్థికంగా వెనకబడిన నిరుపేద విద్యార్థులకు అభయహస్తం అందిస్తున్న వైనం
- అన్నవరం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు అచ్యుతరావు

**ఖమ్మం, ఆగష్టు 23, నేటి శుభోదయ :** ఈ సృష్టిలో అన్ని జన్మల కంటే మానవ జన్మ ఎంతో గొప్పది. ఎందరో సమాజంలో ఉద్భవిస్తారు.. కొందరు తమకోసం తమ కుటుంబం కోసం పనిచేస్తారు. మరికొందరు ఈ సమాజానికి తమకున్న శక్తి అవకాశం మేరా ఏదో చేయాలనే తపనతో పరితపిస్తూ సేవా మార్గాన్ని ఎంచుకుంటారు. అలాంటి గొప్ప మనసు కలిగినటువంటి వ్యక్తిగా ప్రభుత్వ ఉపాధ్యాయులు అచ్యుత రావు కల్కితరాయిగా నిలిచారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన అటవీ ప్రాంతంలోని అన్నవరం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా అచ్యుతరావు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో వృత్తి ఉపాధ్యాయుడు అయినప్పటికీ వారు ఎంచుకున్న మార్గం మాత్రం ప్రవృత్తి సేవ గుణం అందుకే వారు ఎందరో ప్రశంసలందుకున్నారు. మంచి తెలివితేటలు కలిగి ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద గిరిజన హరిజన విద్యార్థులకు వారి భవిష్యత్తుకు చదువుకు ఆటంకం కలగకూడదని ఉద్దేశంతో ఈ సేవా మార్గాన్ని ఎంచుకున్నారు. గతంలో పనిచేసిన పాఠశాలల్లో వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో విద్యార్థులకు పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం అన్నవరం ప్రాథమిక పాఠశాలకు ఎన్నారై ఫౌండేషన్ వారి సహకారంతో సుమారు 70000 విలువైన డిస్క్ బెంచీలు అలాగే డిజిటల్ టీవీ అదే గ్రామంలో ఉన్న అంగన్వాడి సెంటర్ కు కూడా ఒక డిజిటల్ టీవీ నోటుబుక్కులు స్కూలు బ్యాగులు అందించే విధంగా కృషిచేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. అక్కడి విద్యార్థులను జిల్లా రాష్ట్రస్థాయి యోగా పోటీలకు సైతం తీసుకెళ్లారు. వారికి ప్రత్యేకంగా క్రాఫ్ట్ లో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. అలాగే పాఠశాల అనంతరం సెలవు దినాలలో అనేక స్వచ్ఛంద సంస్థలలో సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. సత్యసాయి సేవా సంస్థలో పనిచేస్తూ మానవతా విలువలతో కూడిన విద్య కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ పాలవిక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. అన్నం సేవా ఫౌండేషన్ లో పనిచేస్తూ కరోనా సమయములో అనేక మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించటం ఎంతో దూరం నుంచి తమ ప్రాంతాలకు వెళుతున్న వలస కూలీలను సైతం వారి యొక్క గ్రామాలకు పంపించటం మానసిక సమస్యలతో తిరుగుతున్న వారిని ఆశ్రమంలో







చేర్పించి వాళ్లకి స్వతహాన కలిగించటం లాంటి కార్యక్రమాలు చేపట్టారు. అలాగే ఎన్నారై ఫౌండేషన్ లో నెంబర్ గా పని చేస్తూ జిల్లాలోని అనేక పాఠశాలలకు డిజిటల్ టీవీలు అందించటం నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేయటం హరితహారం లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు. అలాగే కొణిజర్ల మండలం జంపాల నగర్ గ్రామానికి చెందిన అనాధ విద్యార్థి తేజావత్ అంజలిని ఉన్నత చదువులు చదివించటంలో కృషి చేశారు. పల్లిపాడు గ్రామానికి చెందిన మంద నాగరాజు ఒక రోడ్డు ప్రమాదంలో తన కాలును కోల్పోయిన సమయంలో అన్న వెన్నంటి ఉండి మానసిక ధైర్యాన్ని ఇచ్చి కృత్రిమ కాలును ఏర్పాటు చేసి ఆ విద్యార్థిని డిగ్రీ చదివేల ప్రోత్సహించారు అచ్యుత్ రావు. అంతేకాకుండా మిత్రుల సహకారంతో విద్యార్థులకు ఆర్థిక సాయం నూతన దుస్తులు అందించడం వారిని పై చదువుకునేలా ప్రోత్సహించడం లాంటి అనేక కార్యక్రమాలను చేపట్టారు. అంతేకాకుండా అనేక మంది దివ్యాంగులకు ట్రై సైకిల్ అందించటం నిరుపేదలకు నిత్యవసర సరుకులు అందించటం వారికి చదువులు ఆర్థిక సహాయం అందించటం చేశారు. పద్మశ్రీ వనజీ వి రామయ్య పర్యావరణవేత్త కడవెండి వేణుగోపాల్ వంటి వారితో పనిచేసే పర్యావరణ పరిరక్షణలో అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాలకును గమనించిన లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ వారు 20 17 సంవత్సరంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డును అందించారు. అలాగే ప్యూర్ ఆర్గనైజేషన్ వారు 20 18 లో హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో రాష్ట్రస్థాయి ఉత్తమ సేవ అవార్డును కూడా అందించి వారు ప్రతిభకు ఘన సన్మానం సత్కారాలు చేశారు. ప్రతినిత్యము విద్యార్థుల యొక్క క్షేమాలు చూస్తూ పిల్లలను ప్రతి రోజు బడికి తీసుకురావడం, స్వయంగా బడికి రాకుండా ఇంటి వద్ద ఉన్న పిల్లలను గమనించి వారి ఇంటి వద్దకు వెళ్లి స్వయంగా వారి ద్విచక్ర వాహనం మీద తీసుకొని పాఠశాలలకు తీసుకొచ్చి తమ మానవత్వాన్ని చాటుకున్న ఉపాధ్యాయుడుగా నిలిచారు. పిల్లలను ప్రతిరోజు బడికి తీసుకురావడం వారి ఆరోగ్యం పట్ల చదువు పట్ల శ్రద్ధ వహించటం స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా వారికి కావలసిన వనరులు సమకూర్చటం వంటి కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. ఇటీవల కాలంలో రూరల్ డెవలప్మెంట్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సహకారంతో అన్నవరం గ్రామంలో మహిళలకు జూయాట్ బ్యాగ్ తయారీలో శిక్షణ ఇప్పించ తమ ధైన శైలిలో ముందుకు సాగుతున్నారు. అచ్యుత్ రావు లాంటి ఉపాధ్యాయులను ప్రభుత్వం గుర్తించి వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సరైన విధంగా ప్రోత్సహించి వారు రానున్న కాలంలో మరిన్ని గొప్ప సేవా కార్యక్రమాలు చేసి సమాజానికి మంచి పౌరులను తయారు చేసే అవకాశం కల్పించాలని ప్రజలు ప్రజాస్వామ్యవాదులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# ఆత్మగౌరవ పోరాటానికి తెలంగాణ బ్రాహ్మణ సమాజం సిద్ధం

- ఉద్యమకారులకు దక్కని తగిన గుర్తింపు
- తెలంగాణ బ్రాహ్మణసంక్షేమ పరిషత్ నియామకాలపై ఆగ్రహం
- బసవరాజ్ శ్రీనివాస్ అనుచిత వ్యాఖ్యలు బెదిరింపులపై నిరసన
- సామాజిక సామరస్య పరిరక్షణే ధ్యేయం
- ఆగస్టు 25న ధర్నా చౌక్‌లో మహా దీక్ష



**హైదరాబాద్, ఆగష్టు 23, నేటి శుభోదయ :**
తెలంగాణ బ్రాహ్మణ సమాజం తమ ఆత్మగౌరవ పరిరక్షణకు, హక్కుల సాధనకు సమరశంఖం పూరించింది. తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదిక తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల వేదికల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 25 (మంగళవారం) నాడు హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వేదికగా ఉదయం 10:00 గంటల నుండి తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవ దీక్ష పేరిట భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించాయి.

**ఉద్యమకారులకు దక్కని తగిన గుర్తింపు**
1,200 మందికి పైగా అమరుల త్యాగాల ఫలితంగా సిద్ధించిన తెలంగాణ రాష్ట్ర సాధనలో బ్రాహ్మణ ఉద్యమకారులు కీలక పాత్ర పోషించారని నేతలు గుర్తుచేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ కేంద్రంగా, ప్రొఫెసర్ చుక్కా రామయ్య ఆశీస్సులతో సాగిన ఈ పోరాట స్వరం నేటికీ తగిన గుర్తింపు పొందలేకపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్వరాష్ట్రం ఏర్పడి పుష్కర కాలం దాటినా తమ ఆకాంక్షలు నెరవేరకపోగా, వలసవాదుల పెత్తనం ఇంకా కొనసాగుతోందని ఆరోపించారు.

**సంక్షేమ పరిషత్ నియామకాలపై ఆగ్రహం**
తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ప్రధాన బాధ్యతల్లో సీమాంధ్ర మూలాలున్న వ్యక్తులకు ప్రాధాన్యత ఇవ్వడంపై ఐక్యవేదిక తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. తెలంగాణ మట్టి బిడ్డలైన ఉద్యమకారులను పక్కనబెట్టి బయటి వ్యక్తులకు పదవులు కట్టబెట్టడాన్ని తీవ్రంగా ఖండించింది.

**బసవరాజ్ శ్రీనివాస్ అనుచిత వ్యాఖ్యలు బెదిరింపులపై నిరసన**
ఇటీవల జరిగిన ఓ అంతర్గత సమావేశంలో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఛైర్మన్ బసవరాజ్ శ్రీనివాస్ ఉద్యమకారులను ఉద్దేశించి అవమానకర రీతిలో మాట్లాడారని, నేను పదవి వదిలేస్తే నెల రోజుల్లో ఉద్యమకారుల అంతు చూస్తాను అని బహిరంగంగా బెదిరింపులకు దిగారని నేతలు మండిపడ్డారు.

**సామాజిక సామరస్య పరిరక్షణే ధ్యేయం**
సదరు నాయకుడు కుల దురహంకారంతో ప్రసంగిస్తూ దళిత, బహుజన వర్గాల మహిళలను తీవ్రంగా అవమానించారని ఆరోపించారు. బమ్మెర పోతన, కాళోజీ, వట్టికోట అల్వార్ స్వామి, దాశరథి, బుర్గుల రామకృష్ణారావు నుండి పి.వి. నరసింహారావు వరకు తెలంగాణ బ్రాహ్మణ సమాజం ఎప్పుడూ బహుజన వర్గాలతో ఐక్యంగా, సామరస్యంతో జీవించిందని గుర్తుచేశారు. ప్రాంతీయ అహంకారంతో కుల విద్వేషాలను రెచ్చగొట్టడాన్ని నిరసిస్తూ ఈ ఆత్మగౌరవ దీక్ష చేపడుతున్నట్లు ప్రతినిధులు స్పష్టం చేశారు.

# వరిపంటబోనస్ పొందడానికి వివరాలు చేసుకోండి

## - వ్యవసాయ అధికారి రాజేంద్ర అగర్వాల్



**దేవరకద్ర , ఆగస్టు 23 , నేటి శుభోదయ :** మండల పరిధిలోని ఆయా గ్రామాల రైతులు ప్రభుత్వం సూచించిన 7 రకాల వరికి బోనస్ ప్రయోజనం పొందేందుకు ప్రభుత్వం సూచించిన విధంగా వరి సాగుకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రాజేంద్ర అగర్వాల్, ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు.డీలర్ వద్ద వరి విత్తనాలు కొనుగోలు చేసిన చేసే రైతులు సంబంధిత డీలర్ పాయింట్ వద్ద తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని రైతులకుఆయన తెలిపారు. ప్రభుత్వం సూచించిన వరి రకాలైన బిపిటి 5204 (సాంబ మసూరి), డబ్ల్యూజి ఎల్ 44 (సిద్ధి), కె ఎన్ ఎం 1638 (కునారం సన్నాలు), హెచ్ ఎం టి, జై శ్రీరామ్, కె ఎన్ ఎం 7715, ఆర్ ఎన్ ఆర్ 15048 (తెలంగాణ సోనా) రకాలు నమోదు చేసుకోవాలనిఆయన పేర్కొన్నారు.సొంత విత్తనాలతో సాగు చేసే రైతులుపై పేర్కొన్న రకాలలో సొంత విత్తనాలతో వరి సాగు చేస్తున్న రైతులు బోనస్ కోసం స్వీయ ధృవీకరణ పత్రాన్ని సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు సమర్పించాలనిఅనంతరం ఆయా గ్రామాల ఏఈఓ ద్వారా ఆ వివరాలను ధృవీకరించుకోవాలనిఆయన తెలిపారు.వరి సాగుకు సంబంధించిన వివరాల నమోదు ప్రక్రియను సెప్టెంబర్ 10 లోపు పూర్తి చేసుకోవాలన్నారు.

# జమ్మికుంట వారసంతకు కొత్త వేదిక

**కొండూరీ కాంప్లెక్స్ నుంచి పాత వ్యవసాయ మార్కెట్ రోడ్డుకు తరలింపు పనుల పరిశీలన**





**కరీంనగర్, ఆగస్టు 23 , నేటి శుభోదయ :** జమ్మికుంట పట్టణంలో ప్రతి మంగళ వారం నిర్వహించే వారసంత (అంగడి)ను కొండూరీ కాంప్లెక్స్ నుంచి పాత వ్యవసాయ మార్కెట్ రోడ్డుకు తరలించే ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పరిశీలించారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. కొండూరీ కాంప్లెక్స్ ప్రాంతంలో వారసంత నిర్వహణ వల్ల పాఠశాలలు, ఆసుపత్రులు, బొమ్మల గుడి పరిసర ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా వర్షాల సమయంలో ఆయా ప్రాంతాలు బురదమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు.ఇటీవల నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు వారసంతను కొండూరీ కాంప్లెక్స్ నుంచి పాత వ్యవసాయ మార్కెట్ రోడ్డు మీదుగా వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం వరకు తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా లైటింగ్, పారిశుద్ధ్య చర్యలు, చెట్ల కొమ్మల తొలగింపు తదితర పనులు చేపట్టినట్లు వివరించారు.జమ్మికుంట పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ మార్పును గమనించి మున్సిపల్ అధికారులకు సహకరించాలని చైర్మన్ కోరారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇల్లందుల రమేష్, బోళ్ల సదానందం, కొలుగూరి కిరణ్, మహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.


Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620